# ఫ్లయింగ్ సాసర్స్ పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలి?!

(02 జూలై 'ప్రపంచ గుర్తించబడని ఎగిరే వస్తువుల దినం' సందర్భంగా)

అనేక సైన్స్ సంబంధ కాల్పనిక కథలు, సినిమాలు, నవలలు, టివి సీరియల్స్‌ను మనం బహు ఉత్సుకతతో చూస్తూనే ఉన్నాం. అంతరిక్షంలో మానవుడికి సంబంధం లేని గ్రహాంతర వాసులకు చెందిన 'ఫ్లైయింగ్ సాసర్స్ లేదా డిస్క్'లను చూశామని చెప్పుకునే వ్యక్తుల గూర్చి మనం విన్నాం, చదివాం. ఇలాంటి 'గుర్తించబడని ఎగిరే వస్తువులు లేదా అన్‌ఐడెంటిఫైడ్ ఫ్లైయింగ్ ఆబ్జెక్ట్స్, యుయఫ్ఓ' ఉనికి, ఆధారాల, ఆకారాల గూర్చి ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రతి ఏటా 02 జూలై రోజున 'వరల్డ్ అన్‌ఐడెంటిఫైడ్ ఫ్లైయింగ్ ఆబ్జెక్ట్స్ (యుయఫ్ఓ) డే'గా నిర్వహించుట జరుగుతుంది.

భూమికి, మానవాళికి తెలియని గ్రహాంతర వాసులు ప్రయోగించిన అంతరిక్ష నౌకల ఉనికి గూర్చిన చర్చలు పలు మార్లు వింటున్నాం, చర్చించుకుంటున్నాం. యుయఫ్ఓల గూర్చి నిర్వివాదమైన సాక్ష్యాలు ఉన్నాయని ప్రజల్లో అవగాహన కల్పించడం జరగాలి.

అమెరికాలో 24 జూన్ 1947న 'కెన్నెత్ ఆర్నాల్డ్' ఏయిర్ క్రాఫ్ట్‌లో ఆకాశంలో తిరుగుతున్నపుడు తొలిసారి 'యుయఫ్ఓ'లను చూశానని తెలియజేయడం జరిగింది. 1977 వరకు ప్రపంచవ్యాప్తంగా 15 మిలియన్ల జనులు యుయఫ్ఓలను చూసి ఉన్నారని కెన్నెత్ తెలియజేశారు. న్యూ మెక్సికో సమీపాన 02 జూలై 1947న 'రూజ్వెల్ యుయఫ్ఓ ఫ్లైయింగ్ డిస్క్ క్రాష్' జరిగిందని చరిత్ర చెబుతున్నది. ఇలాంటి ఫ్లైయింగ్ డిస్క్‌లను గ్రహాంతర వాసులు ప్రయోగించి ఉండవచ్చనే భావనను ప్రచారం చేశావారు కూడా ఉన్నారు.

ఏప్రిల్ 2020లో అమెరికన్ రక్షణశాఖ విడుదల చేసిన మానవ నిర్మితం కాని, భూమి ప్రమేయం లేని అంతరిక్షంలో ఎగిరే వస్తువుల గూర్చిన వీడియోల్లో కొంత ఆసక్తికర విషయాలు బయట పడ్డాయి. ప్రపంచ యుయఫ్ఓ దినం వేదికగా సమావేశాలు, టెలిస్కోప్‌తో అంతరిక్ష దర్శనం, సైన్స్ ఫిక్షన్ సినిమాలు, డాక్యుమెంటరీలు చూడడం, చర్చించడం జరగాలి. గ్రహాంతర యుయఫ్ఓల గూర్చిన చర్చలు వ్యోమగాముల దృష్టిని ఆకర్షించుట జరుగుతున్నది. యుయఫ్ఓలను ఇతర గ్రహాల్లో నివసిస్తున్న గ్రహాంతర వాసులు ప్రయోగించి ఉండవచ్చని కొందరు శాస్త్రజ్ఞులు కూడా అభిప్రాయ పడుతున్నారు.

యుయఫ్ఓల ఉనికిని ఖచ్చితమైన ఆధారాలతో రుజువు చేసిన వారు లేరు. అవి ఉన్నాయనేది ఒక భావన మాత్రమే అనే వారు కూడా ఉన్నారు. ఏలియన్, ఈటి, మెన్ ఇన్ బ్లాక్, ది థింగ్ లాంటి సినిమాలను చూస్తే యుయఫ్ఓల గుర్చిన కొంత సమాచారం దొరుకుతుంది. ఇలాంటి గ్రహాంత ఎగిరే వస్తువులు లేదా ఫ్లైయింగ్ సాసర్స్ పట్ల ప్రజల్లో సాధికార అవగాహన కల్పించాల్సిన కనీస బాధ్యత ప్రభుత్వాలు, శాస్త్రజ్ఞుల మీదనే ఉందని గుర్తుంచుకోవాలి. ఈ డిజిటల్ శాస్త్రసాంకేతిక యుగంలో యుయఫ్ఓల ఉనికి రుజువు కావాలని, గుడ్డిగా నమ్మడం మంచిది కాదని తెలుసుకుందాం.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

## రైతు బాంధవుడు కేసీఆర్.. ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు



కరీంనగర్ , జులై 1: (నేటినిజం ప్రతినిధి): ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు రైతు బంధువు అని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు అన్నారు. మండలంలోని సంగం నాగులపేట గ్రామాల్లో కళ్యాణ లక్ష్మి రైతుబంధు చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు .ఈ సందర్భంగా ఎమ్మెల్యే కల్వకుంట్ల మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో పథకాలు చేపట్టిందని పేర్కొన్నారు. రైతు కుటుంబంలో కుటుంబ యజమాని మరణిస్తే ఆ కుటుంబాన్ని అరికెనేందుకే కేసీఆర్ రైతుబంధు పథకాన్ని ప్రవేశపెట్టారని గుర్తు చేశారు .ఈ పథకం ద్వారా ఇప్పటికే ఎన్నో కుటుంబాలు లబ్ధి పొందాయని అన్నారు. రైతు మృతి చెందిన 20 రోజుల్లోనే లబ్ధిదారుల ఖాతాలో డబ్బు జమవుతుందని పేర్కొన్నారు.

అనంతరం ఆయా గ్రామాల్లో కళ్యాణ లక్ష్మి చెక్కులను అందించారు. సంఘం గ్రామంలోని సంగమేశ్వర ఆలయంలో ఎమ్మెల్యే పూజా నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేస్తానని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తోట నారాయణ, జిల్లా రైతుబంధు అధ్యక్షులు చీటీ వెంకటరావు, సర్పంచుల పురం జిల్లా గౌరవ అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, మండల వ్యవసాయ అధికారి నాగమణి ,ఏఈఓ నరేష్, సర్పంచులు చెప్పాల్లాల్. నరసయ్య కేతిరెడ్డి భాస్కర్ రెడ్డి రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఉమేష్, వీఆర్వో భాస్కర్ ,రైతుబంధు గ్రామ శాఖ అధ్యక్షులు సుధా వేణి భూమయ్య నారాయణరెడ్డి ఉప సర్పంచ్ సాగరిక శంకర్ పాలూరు వార్డు సభ్యులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు

## విశ్వం విద్యాసంస్థల అధినేత కాశీవిశ్వనాద్ దుర్మరణం



హైదరాబాద్, జులై 1: విశ్వం విద్యాసంస్థల అధినేత కాశీ విశ్వనాద్ రోడ్డుప్రమాదంలో దుర్మరణం చెందాడు. తిరుపతి జిల్లా నాయుడుపేట నుండి గూడూరుకు కాశీవిశ్వనాద్ మోటర్ సైకిల్ పై వెళుతుండగా.. నెల్లూరు జిల్లా చిల్లకూరు మండలం వరగలి జాతీయ రహదారి వద్ద లారీ ఢీకొని ఘోర ప్రమాదం జరిగింది. ఈ ప్రమాంలో కాశీ విశ్వనాద్ అక్కడిక్కడికే మృతిచెందాడు. దీంతో నాయుడుపేటలో మహా విషాదం చోటుచేసుకుంది. సర్వ శిక్ష అభియాన్ పి.ఓ గా పనిచేసిన కాశీ నాయుడుపేటలో విశ్వం విద్యా సంస్థలు నిర్వహిస్తున్నారు. ఈయన మరణంతో విషాదం నెలకొంది.

## సంక్షేమం, అభివృద్ధి పథకాలను చూసే టీఆర్ఎస్‌లో చేరుతున్నారు

హైదరాబాద్, జులై 1: రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలతో పాటు సీఎం కేసీఆర్ పరిపాలనను చూసి ఇతర పార్టీల నాయకులు టీఆర్ఎస్‌లో స్వచ్ఛందంగా చేరుతున్నారని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు బి.దీపక్‌కుమార్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి, అంబర్‌పేట రఘునాథ్‌నగర్‌కు చెందిన కె.రమేశ్, నల్లకుంట డివిజన్ బీజేవైఎం కార్యదర్శి భిక్షపతి, కాచిగూడ చప్పల్‌బజార్‌కు చెందిన బీజేపీ నాయకులు సూర్యారావు, రాజేశ్ బుధవారం ఎమ్మెల్యే సమక్షంలో టీఆర్ఎస్ పార్టీలో చేరారు.

వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతి ఇంటికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందుతున్నాయని చెప్పారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. అభివృద్ధిని కండ్లారా చూస్తున్న ఇతర పార్టీల నాయకులు టీఆర్ఎస్‌లో చేరుతున్నారని వెల్లడించారు. త్వరలోనే మరింత మంది ఇతర పార్టీల నాయకులు, పలు సంస్థల ప్రతినిధులు పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు భీష్మాదేవ్, మేడి ప్రసాద్, చంద్రమోహన్, సీనియర్ నాయకులు ఆర్కే బాబు, కనివేట నర్సింగ్‌రావు, రాము, శంకర్, దిలీప్, మిసాల నర్సింగ్‌రావు, సత్యనారాయణ, ప్రదీప్, సునీల్ బిడ్లానీ, జాకీ తదితరులు పాల్గొన్నారు.

## రూ. 8కోట్లతో గ్రంథాలయ భవనాలు

హైదరాబాద్, జులై 1: నగర కేంద్ర గ్రంథాలయం పరిధిలోకి వచ్చే గ్రంథాయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని నగర కేంద్ర గ్రంథాలయ చైర్‌పర్సన్ ప్రసన్న రామ్మూర్తి తెలిపారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో రూ. 8 కోట్లతో నూతన గ్రంథాలయ భవనాల నిర్మాణం చేపడుతున్నట్లు వెల్లడించారు. చిక్కడపల్లిలోని నగర కేంద్ర గ్రంథాలయంలో 33 గ్రంథాలయాల లైబ్రేరియన్స్, ఇన్‌చార్జి లైబ్రేరియన్స్‌తో సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నగరంలో కేంద్ర గ్రంథాలయం పరిధిలోకి వచ్చే 82 గ్రంథాలయాల అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తున్నామని తెలిపారు. అందులో భాగంగానే శిథిలావస్థకు చేరుకున్న గ్రంథాలయాలను గుర్తించి, వాటి స్థానంలో నూతన భవనాలు నిర్మించనున్నట్లు తెలిపారు.

రూ.8 కోట్లతో 12 నూతన భవనాలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా.. రూ.2.11 కోట్లతో 33 గ్రంథాలయాల మరమ్మతు పనులు చేపడుతున్నట్లు చెప్పారు. రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ అధ్యక్షుడు ఆయాచితం శ్రీధర్ గ్రంథాలయాల అభివృద్ధికి సహకారం అందిస్తున్నారని తెలిపారు. ప్రధానంగా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు అవసరమైన పుస్తకాలను అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. నగర కేంద్ర గ్రంథాలయ కార్యదర్శి పద్మజ, సుకేశ్, వెంకటేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ అశ్విని వైష్ణవ్ సహ అధ్యక్షతన ముంబయి-అహ్మదాబాద్ హైస్పీడ్ రైలు ప్రాజెక్టుపై 14వ జాయింట్ కమిటీ సమావేశం

న్యూఢిల్లీ, జులై 1: ముంబయి-అహ్మదాబాద్ హైస్పీడ్ రైలు ప్రాజెక్టు 14వ జాయింట్ కమిటీ సమావేశం ఈ రోజు జరిగింది. ముంబయి-అహ్మదాబాద్ హైస్పీడ్ రైల్ (ఎంఏహెచ్‌ఎస్ఆర్) ప్రాజెక్ట్ అమలుకు సంబంధించిన ముఖ్యమైన అంశాలపై చర్చించి నిర్ణయం తీసుకోవడానికి.. రైల్వేలు, కమ్యూనికేషన్లు మరియు ఎలక్ట్రానిక్స్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ మంత్రి శ్రీ అశ్విని వైష్ణవ్ ఈ రోజు సమావేశంలో పాల్గొన్నారు. 14వ జాయింట్ కమిటీ సమావేశానికి అధ్యక్షత ఆయన భారతదేశం తరఫున ఈ సమావేశానికి సహ అధ్యక్షతను వహించారు. జపాన్ ప్రధాన మంత్రి ప్రత్యేక సలహాదారు డాక్టర్ వెరోరీ మసాఫుమి జపాన్ వైపు నుండి సమావేశానికి కో-అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో ప్రాజెక్ట్ పురోగతికి సంబంధించిన ప్రదర్శన మరియు వీడియో ఫిల్మ్‌ను ప్రదర్శించారు. దీనికి తోడు నిధులు, ఒప్పందాల అమలుకు సంబంధించిన సమస్యలు పరస్పర పరిష్కారం మరియు ప్రాజెక్ట్ యొక్క లక్ష్య కమీషన్ తదితర అంశాలు ఇందులో చర్చించబడ్డాయి. ఈ ప్రాజెక్టుకు సంబంధించి భారత ప్రభుత్వం మరియు జపాన్ ప్రభుత్వం మధ్య జాయింట్ కమిటీ సమావేశం పరస్పర ప్రయోజనాలతో పాటు, ఆయ ప్రయోజనాలకు సంబంధించిన ప్రాజెక్టుల్ని ముందుకు తీసుకెళ్లడానికి అత్యున్నత సంప్రదింపుల వ్యవస్థ. జపాన్ ప్రభుత్వం ఎంఏహెచ్‌ఎస్ఆర్) ప్రాజెక్ట్‌లకు తక్కువ వడ్డీతో కూడిన రుణం మరియు సాంకేతికత, ఆర్థిక సహకార నిధులను సమకూర్చడానికి కట్టుబడి ఉంది. ఈ సమావేశం ఫలప్రదంగా ముగిసింది. ఈ మీటింగ్ ఉత్పాదకమైనది మరియు ప్రాజెక్ట్ త్వరగా పూర్తి చేయడానికి వ్యూహాత్మక సమస్యలను ఖరారు చేసింది. ప్రాజెక్ట్ యొక్క మొత్తం ప్రయోజనాల దృష్ట్యా ఒక ప్రాజెక్ట్ - ఒక బృందం యొక్క గౌరవనీయమైన పీఎం యొక్క అభిప్రాయానికి అనుగుణంగా పని చేయడానికి ఇరుపక్షాలు అంగీకరించాయి.

# 'ఉద్యమ భారతం' కార్యక్రమంలో పాల్గొన్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, జులై 1: ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఇవాళ 'ఉద్యమ భారతం' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇందులో భాగంగా 'ఎంఎస్ఎంఈ' పనితీరు మెరుగు-వేగిరపరచే (ర్యాంప్) పథకం, 'ఆరంభ 'ఎంఎస్ఎంఈ' ఎగుమతిదారుల సామర్థ్యం పెంపు' (సీబీఎఫ్టీఈ), పథకాలతోపాటు 'ఎంఎస్ఎంఈ' రంగం ప్రగతి దిశగా 'ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం' (పీఎంఈజీపీ)లో ప్రవేశపెట్టిన కొత్త అంశాలు వగైరా కీలక చర్యలకు శ్రీకారం చుట్టారు. దీంతోపాటు 2022-23కుగాను 'పీఎంఈజీపీ' లబ్ధిదారులకు ఆర్థిక సహాయాన్ని ఆయన డిజిటల్ రూపంలో బదిలీ చేశారు. 'ఎంఎస్ఎంఈ' ఐడియా హ్యాకథాన్-2022 ఫలితాలు ప్రకటించారు; 'ఎంఎస్ఎంఈ' జాతీయ అవార్డులు-2022 ప్రదానం చేశారు; స్వావలంబన భారతం నిధి (ఎన్ఆర్ఐ) పరిధిలోని 75 'ఎంఎస్ఎంఈ'లకు డిజిటల్ ఈక్విటీ సర్టిఫికెట్లు అందజేశారు. కేంద్రమంత్రులు శ్రీ నారాయణ్ రాణే, శ్రీ భాను ప్రతాప్ సింగ్ వర్మతోపాటు దేశం నలుమూలల నుంచి 'ఎంఎస్ఎంఈ' భాగస్వాములసహా వివిధ దేశాల నుంచి దౌత్యవేత్తలు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ప్రధానమంత్రి ప్రసంగిస్తూ- స్వయం సమృద్ధ భారతం దిశగా 'ఎంఎస్ఎంఈ' రంగం చేస్తున్న కృషి కీలక చోదకమని ప్రకటించారు. ఈ 21వ శతాబ్దంలో భారత్ సాధించే ప్రతి విజయం 'ఎంఎస్ఎంఈ' రంగం సఫలీకృతం కావడంపైనే ఆధారపడి ఉందని ఆయన స్పష్టం చేశారు. భారత్ నుంచి ఎగుమతులు పెంచడానికి, సరికొత్త విపణులను అందుకోవడానికి 'ఎంఎస్ఎంఈ' రంగం దృఢంగా ఉండటం ఎంతో అవసరమని ఆయన నొక్కిచెప్పారు. ''ఈ రంగానికిగల అపార సామర్థ్యంతోపాటు మీ అవసరాలకు అనుగుణంగానే మా ప్రభుత్వం విధానాల రూపొందించడమే కాకుండా తగిన నిర్ణయాలు కూడ తీసుకుంటోంది" అని ఆయన చెప్పారు. ప్రభుత్వం ఇవాళ ప్రారంభించిన వినూత్న పథకాలు, చేపట్టిన ఇతర చర్యలు 'ఎంఎస్ఎంఈ' రంగం నాణ్యత, ప్రోత్సహంతో ముడిపడినవేనని ఆయన వెల్లడించారు.

మనం 'ఎంఎస్ఎంఈ' అంటున్న సంక్షిప్త రూపాన్ని విస్తృతం చేస్తే సాంకేతికంగా అది "సూక్ష్మ-చిన్న-మధ్యతరహా పరిశ్రమల" సమాహారం అవుతుందని ప్రధానమంత్రి అన్నారు. అయితే- ఈ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల రంగమే భారతదేశ వృద్ధి పయనానికి మూలస్తంభమని గుర్తుచేశారు. మన ఆర్థిక వ్యవస్థలో మూడోవంతు వాటా 'ఎంఎస్ఎంఈ' రంగానిదేనని పేర్కొన్నారు. 'ఎంఎస్ఎంఈ' రంగాన్ని రంగాన్ని బలోపేతం చేయడమంటే మొత్తం సమాజాన్ని బలోపేతం చేయడం మాత్రమేగాక ప్రతి ఒక్కరినీ అభివృద్ధి ఫలాల లబ్ధిదారులను చేయడమేనని తెలిపారు. అందుకే ఈ రంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నదని చెప్పారు. ఈ మేరకు 'ఎంఎస్ఎంఈ' రంగాన్ని బలోపేతం చేయడానికి ఎనిమిదేళ్లుగా ప్రభుత్వ కృషి చేస్తున్నదని ప్రధానమంత్రి పేర్కొన్నారు. తదనుగుణంగా బడ్జెట్ కేటాయింపులను 650 శాతానికిపైగా పెంచిందని గుర్తుచేశారు. "మాకు సంబంధించినంత వరకూ 'ఎంఎస్ఎంఈ' అంటే... సూక్ష్మ-చిన్న-మధ్యతరహా పరిశ్రమలకు గరిష్ఠ మద్దతు" అని ప్రధాని నొక్కిచెప్పారు.

ఈ రంగంలో 11 కోట్ల మందికిపైగా ముడిపడి ఉన్నారని పేర్కొంటూ- ఉపాధి కల్పనలో 'ఎంఎస్ఎంఈ' ఎంతో కీలకమని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. కరోనా మహమ్మారి సమయంలో చిన్న పరిశ్రమలను ఆదుకోవడం ద్వారా వాటికి కొత్త జవసత్వాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఆ మేరకు 'అత్యవసర దశలవారీ రుణ హామీ' పథకం కింద కేంద్ర ప్రభుత్వం 'ఎంఎస్ఎంఈ'లకు రూ.3.5 లక్షల కోట్లు అందజేసిందని వివరించారు. ఒక నివేదిక ప్రకారం- ఈ పథకం అమలు ఫలితంగా సుమారు 1.5 కోట్ల ఉద్యోగాలు రక్షించబడ్డాయని ప్రధానమంత్రి గుర్తుచేశారు. భారత స్వాతంత్ర్య సంబంధిత 'అమృత్ కాలం' వాగ్దానాలను నెరవేర్చడంలో 'ఎంఎస్ఎంఈ' రంగమే కీలక మాధ్యమమని ఆయన అన్నారు.

పూర్వ ప్రభుత్వాలు ఈ రంగం ప్రాధాన్యాన్ని గుర్తించలేదని శ్రీ మోదీ అన్నారు. అందుకే చిన్న పరిశ్రమలను చిన్నవిగానే ఉంచే విధానాలను అనుసరిస్తూ వాటి ప్రగతికి సంకెళ్లు వేశాయని చెప్పారు. ఈ సంకెళ్లను తెగవేయడంలో భాగంగా 'ఎంఎస్ఎంఈ' నిర్వచనాన్ని మార్పు చేశామని చెప్పారు. ఏ పరిశ్రమ అయినా ఎదగాలన్నా, తన పరిధిని విస్తరించాలన్నా ప్రభుత్వం దానికి మద్దతు ఇవ్వాలని ప్రధానమంత్రి అన్నారు. అంతేకాకుండా సంబంధిత విధఆనాల్లో అవసరమైన మార్పులు తేవాలని పేర్కొన్నారు. 'ఎంఎస్ఎంఈ' రంగం ప్రభుత్వానికి వస్తుసేవలు అందించడంలో 'జీఈఎం' ఒక బలమైన వేదికగా ఉపయోగపడుతుందని ప్రధాని చెప్పారు. అందువల్ల 'ఎంఎస్ఎంఈ' రంగంలోని ప్రతి పరిశ్రమ 'జీఈఎం' పోర్టల్ లో నమోదు కావాలని ఆయన సూచించారు. అదేవిధంగా రూ.200 కోట్లకన్నా తక్కువ విలువైన ప్రాజెక్టులకు అంతర్జాతీయ టెండర్లను నిషేధించడం కూడా 'ఎంఎస్ఎంఈ'లకు దోహదపడే నిర్ణయమేనని తెలిపారు. ఎగుమతులను పెంచడంలో 'ఎంఎస్ఎంఈ'లకు సాయపడే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ప్రధాని చెప్పారు. ఇందుకు అనుగుణంగా కృషి చేయాల్సిందిగా విదేశాల్లోని భారత దౌత్య కార్యాలయాలను ఆదేశించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా అవి చేస్తున్న కృషిని వాణిజ్యం, సాంకేతికత, పర్యాటకం అనే మూడు పారామితుల ప్రాతిపదికన మూల్యాంకనం చేస్తున్నట్లు ప్రధానమంత్రి వెల్లడించారు.

ప్రధానమంత్రి రోజ్‌గార్ సృజన్ కార్యక్రమం 2008-2012 మధ్య కాలంలో లక్ష్యాన్ని సాధించడంలో విఫలమైందన్నారు. అందుకే 2014 తర్వాత దీన్ని సరికొత్తగా తీర్చిదిద్దామని ప్రధానమంత్రి తెలిపారు. దీంతో 2014 నుంచి ఈ కార్యక్రమం కింద ఇప్పటిదాకా 40 లక్షలకుపైగా ఉద్యోగాలు సృష్టించబడ్డాయని పేర్కొన్నారు. ఈ కాలంలో ఈ సంస్థలకు రూ.14 వేల కోట్ల విలువైన ఆర్థిక సహాయాన్ని రాయితీ రూపంలో అందించామని తెలిపారు. ఈ పథకం పరిధిలోకి వచ్చే ఉత్పత్తుల ధర పరిమితిని కూడా పెంచినట్లు ఆయన వెల్లడించారు. సమ్మిళిత అభివృద్ధి గురించి ప్రస్తావిస్తూ- లింగమార్పిడి వర్గంలోని వ్యవస్థాపకులు తమ లక్ష్యాలను సాకారం చేసుకునే దిశగా అన్నిరకాల సహాయాన్ని అందిస్తున్నామని ప్రధానమంత్రి అన్నారు. ఇక నేడు తొలిసారిగా ఖాదీ-గ్రామీణ పరిశ్రమల సంస్థ వార్షిక వాణిజ్య పరిమాణం రూ.లక్ష కోట్లు దాటిందని ప్రధాని వివరించారు. "గ్రామీణ ప్రాంతాల్లోని మన చిన్న పారిశ్రామికవేత్తలు, సోదరీమణులు ఎంతో శ్రమించడం వల్లనే ఇది సాధ్యమైంది... ఆ మేరకు గత 8 ఏళ్లలో ఖాదీ విక్రయాలు 4 రెట్లు పెరిగాయి" అన్నారు.

సమాజంలోని బలహీన వర్గాలు వ్యవస్థాపకన మార్గాన్ని అనుసరించడంలో హామీరహిత రుణాలు పొందడానికి ఇబ్బందులు ఉండటం ప్రధాన అవరోధంగా మారిందని ప్రధానమంత్రి అన్నారు. ఈ నేపథ్యంలో 2014 తర్వాత 'సబ్‌కా సాథ్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్.. సబ్‌కా ప్రయాస్' ద్వారా వ్యవస్థాపకన పరిధిని విస్తరించాలని నిర్ణయించినట్లు చెప్పారు. దీనికి తగినట్లుగా ప్రవేశపెట్టిన 'ముద్రా యోజన' ప్రతి భారతీయుడి వ్యవస్థాపన కలను సాకారం చేయడంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నదని ఆయన అన్నారు. ఈ పథకం కింద హామీ లేకుండా బ్యాంకు రుణాలు లభించడంతో దేశవ్యాప్తంగా మహిళా, దళిత, వెనుకబడిన, గిరిజన పారిశ్రామికవేత్తల సంఖ్య భారీగా పెరిగిందని గుర్తుచేశారు. ఈ పథకం కింద ఇప్పటిదాకా దాదాపు రూ.19 లక్షల కోట్ల మేర రుణాలివ్వగా, రుణ గ్రహీతలలో దాదాపు 7 కోట్ల మంది తొలిసారిగా వ్యవస్థాపకులైన కొత్త పారిశ్రామికవేత్తలు ఉన్నారని ఆయన తెలిపారు. ఇక 'ఉద్యమ' పోర్టల్ లో నమోదైనవారిలో 18 శాతం మహిళా పారిశ్రామికవేత్తలేనని చెప్పారు. "వ్యవస్థాపనతోపాటు ఆర్థికంగానూ సార్వజనీనత సాధనే సామాజిక న్యాయ కల్పనకు నిజమైన నిదర్శనాలు" అని ఈ సందర్భంగా ప్రధాని పేర్కొన్నారు.

ప్రధానమంత్రి తన ప్రసంగాన్ని ముగిస్తూ- "ఇవాళ ఈ కార్యక్రమం ద్వారా 'ఎంఎస్ఎంఇ' రంగంతో ముడిపడి ఉన్న నా సోదర-సోదరీమణులందరికీ నేను హామీ ఇస్తున్నాను. మీ అవసరాలను తీర్చగల విధానాలను రూపొందించడానికి, మీతో చురుగ్గా అడుగు కలపడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఈ వ్యవస్థాపక భారతం సాధించే ప్రతి విజయం మనను స్వయం సమృద్ధ భారతదేశం దిశగా నడుపుతుంది. ఆ మేరకు మీతోపాటు మీ సామర్థ్యాన్ని నేను విశ్వసిస్తున్నాను" అని భరోసా ఇచ్చారు.

కార్యక్రమ నేపథ్యం

'ఉద్యమ భారతం' అన్నది 'ఎంఎస్ఎంఈ'ల సాధికారత దిశగా ప్రభుత్వం తొలిరోజు నుంచీ చూపుతున్న నిబద్ధతకు ప్రతీక. 'ఎంఎస్ఎంఈ' రంగానికి కావాల్సిన, సమయానుగుణ మద్దతు కోసం 'ముద్రా యోజన, అత్యవసర దశలవారీ రుణహామీ పథకం, సంప్రదాయ పరిశ్రమల పునరుజ్జీవన నిధుల పథకం (స్ఫూర్తి) తదితర అనేక కార్యక్రమాలను ప్రభుత్వం ఎప్పటికప్పుడు ప్రారంభిస్తూ వచ్చింది. దీంతో దేశవ్యాప్తంగా కోట్లాదిగా ప్రజలకు ప్రయోజనం చేకూరింది.

'ఎంఎస్ఎంఈ' పనితీరు మెరుగు-వేగిరపరచే (ర్యాంప్) పథకం రూ.6,000 కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభించబడింది. ప్రస్తుత 'ఎంఎస్ఎంఈ' సంబంధిత పథకాల ద్వారా రాష్ట్రాలలో 'ఎంఎస్ఎంఈ' రంగం సామర్థ్యం, పరిధి విస్తరించడం 'ర్యాంప్' లక్ష్యం. ఇది 'ఎంఎస్ఎంఈ'లను స్పర్ధాత్మకంగా మార్చడం కోసం నవ్యావిష్కరణలను, ఆలోచనలను ప్రోత్సహించడంతోపాటు నాణ్యత ప్రమాణాలను పెంచేందుకు దోహదపడుతుంది. అలాగే విధానాలు-ప్రక్రియలుసహా మార్కెట్ లభ్యతను మెరుగుపరుస్తుంది. సాంకేతిక సాధనాలు, పరిశ్రమ 4.0 వినియోగం ద్వారా కొత్త వ్యాపార, వ్యవస్థాపకతలకు ఊతమిస్తూ స్వయం సమృద్ధ భారతం సాధన కృషికి బాసటగా నిలుస్తుంది.

'ఆరంభ 'ఎంఎస్ఎంఈ' ఎగుమతిదారుల సామర్థ్యం పెంపు' (సీబీఎఫ్టీఈ) పథకం అంతర్జాతీయ మార్కెట్ కోసం ప్రపంచ స్థాయి ప్రమాణాల వస్తుసేవలు అందించేలా 'ఎంఎస్ఎంఈ'లను ప్రోత్సహిస్తుంది. ప్రపంచ ఉత్పాదక-సరఫరా వ్యవస్థలో భారతీయ 'ఎంఎస్ఎంఈ'ల భాగస్వామ్యాన్ని మెరుగుపరచడం ద్వారా తమ ఎగుమతి సామర్థ్యాన్ని గ్రహించడంలో వాటికి సహాయపడుతుంది.

'ఎంఎస్ఎంఈ' రంగం ప్రగతి దిశగా 'ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం' (పీఎంఈజీపీ)లో ప్రవేశపెట్టిన కొత్త అంశాల విషయానికొస్తే- తయారీ రంగానికి గరిష్ఠ ప్రాజెక్ట్ వ్యయం (రూ. 25 లక్షల నుంచి) రూ.50 లక్షలకు, సేవా రంగంలో (రూ.10 లక్షల నుంచి) రూ. 20 లక్షలకు పెంచబడింది. అంతేకాకుండా ప్రత్యేక కేటగిరీకింద ప్రగతికాముక జిల్లాలు, లింగమార్పిడి వర్గం నుంచి దరఖాస్తుదారులు అధిక రాయితీలను పొందడానికి వీలుగా ఈ పథకం పరిధిలోకి తెచ్చింది. బ్యాంకింగ్, సాంకేతిక, మార్కెటింగ్ నిపుణుల సమ్మేళనంతో దరఖాస్తుదారులు/ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు చేయూతనిచ్చేందుకు దోహదం చేస్తుంది.

ఎంఎస్ఎంఈ' ఐడియా హ్యాకథాన్ -2022 అనేది వ్యక్తులలో నిబిడీకృతమైన సృజనాత్మకతను ప్రోత్సహించి, మద్దతు ఇవ్వడానికి ఉద్దేశించబడింది. 'ఎంఎస్ఎంఈ'లలో సరికొత్త సాంకేతికతలు, ఆవిష్కరణల అనుసరణను ప్రోత్సహిస్తుంది. సంరక్షకత్వంపై ఎంపిక చేసిన వినూత్న ప్రతిపాదనలకు రూ.15 లక్షల మేర ఆర్థిక సహాయం అందించబడుతుంది.

'ఎంఎస్ఎంఈ' జాతీయ అవార్డులు -2022 అనేది భారతదేశ గతిశీల 'ఎంఎస్ఎంఈ' రంగం వృద్ధి, ప్రగతి దిశగా అత్యుత్తమ పనితీరు కనబరచిన 'ఎంఎస్ఎంఈ'లు, రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలతోపాటు ప్రగతికాముక జిల్లాలు, బ్యాంకుల సహకారానికి గుర్తింపు ఇవ్వడానికి ఉద్దేశించిన కార్యక్రమం.

## ఇజ్రాయిల్ ప్రధానమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన యెయిర్ లాపిడ్‌కు అభినందనలు తెలిపిన ప్రధానమంత్రి శ్రీనరేంద్ర మోదీ

న్యూఢిల్లీ, జులై 1: ఇజ్రాయిల్ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన, హిజ్ ఎక్సలెన్సీ యెయిర్ లాపిడ్‌కు ప్రధానమంత్రి శ్రీనరేంద్ర మోదీ అభినందనలు తెలిపారు. అలాగే హిజ్ ఎక్సలెన్సీ నఫ్తలి బెన్నెట్ భారత్‌కు నిజమైన స్నేహితుడుగా ఉన్నారని అంటూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

ఇందుకు సంబంధించి వరుస ట్వీట్లు చేస్తూ ప్రధానమంత్రి,"హిజ్ ఎక్సలెన్సీ యెయిర్‌లాపిడ్ ఇజ్రాయిల్ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టినందుకు హృదయపూర్వక అభినందనలు.

ఇరుదేశాల మధ్య పూర్తి స్థాయి దౌత్యసంబంధాలు ఏర్పడి 30 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా మన మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకుపోయేందుకు ఎదురుచూస్తున్నాను" అని ప్రధానమంత్రి తమ సందేశంలో తెలిపారు. అలాగే, "హిజ్ ఎక్సలెన్సీ నఫ్తాలిబెన్నెట్, భారతదేశానికి నిజమైన స్నేహితుడిగా ఉన్నందుకు వారికి కృతజ్ఞతలు , మన మధ్య ఫలవంతమైన చర్చల జ్ఞాపకాలను నేను గుర్తుచేసుకుంటున్నాను. మీ నూతన పాత్రలో మీరు విజయం సాధించాలని కోరుకుంటున్నాను" అని ప్రధానమంత్రి తమ సందేశంలో పేర్కొన్నారు.

## తిరుపతి కోఆపరేటివ్ బ్యాంక్ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థిని గెలిపించండి : ఎమ్మెల్యే భూమన



తిరుపతి జులై 1: ప్రతిష్టాత్మక తిరుపతి టౌన్ బ్యాంక్ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బలపరిచిన అభ్యర్థులే విజయ దుందుభి మోగిస్తారని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో శుక్రవారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భూమన కరుణాకర రెడ్డి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. స్థానిక పోస్ట్ ఆఫీస్ రోడ్డు, నవాబ్ పేట, ఎస్ కే డి నగర్, సున్నపు వీధి, బండ్ల వీధి నెహ్రూ వీధి, పెద్ద కాపు వీధి చిన్న కాపు వీధి తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టౌన్ బ్యాంక్ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాల్సిందిగా అభ్యర్థించారు. ఈ నేపథ్యంలోనే మీడియా ప్రతినిధులతో భూమన కరుణాకర రెడ్డి మాట్లాడారు. అత్యంత ప్రతిష్ఠాత్మకమైన టౌన్ బ్యాంక్ ఎన్నికలు ఈనెల 20వ తేదీన జరగనున్నాయని తెలిపారు. ఎంతో ఘన చరిత్ర కలిగిన టౌన్ బ్యాంక్ ఎన్నికలో సమర్థవంతమైన అభ్యర్థులను ఎంపిక చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తమను ఆదేశించారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు సుశిక్షితులైన, సమర్థవంతమైన, తెలివైన వారిని సేవ చేయాలన్న సంకల్పంతో ఉన్న 12 మందిని అభ్యర్థులుగా నిర్ణయించి బరిలోకి దించినట్టు తెలిపారు. ఈ రోజే ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించామని పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారానికి వెళ్తున్న తమను ప్రజలు పెద్ద ఎత్తున ఆశీర్వదిస్తున్నారని వివరించారు. టౌన్ బ్యాంక్ ఎన్నికల్లో 12 అభ్యర్థులను గెలిపించుకునే విధంగా వైఎస్సార్ సీపీ శ్రేణులు కలిసికట్టుగా ఎన్నికల ప్రచారం చేస్తున్నామని తెలిపారు. వైఎస్సార్ సీపీ బలపరుస్తున్న అభ్యర్థులు విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టౌన్ బ్యాంక్ వైఎస్సార్ సీపీ డైరెక్టర్ అభ్యర్థులు కేతం జయచంద్రా రెడ్డి, రేమాల బ్రహ్మానంద రెడ్డి, అనిల్ రాయల్, కాశీం, కడపగుంట అమరనాద్ రెడ్డి, మాకం చంద్రయ్య, వై వాసుదేవ యాదవ్, పోలిరెడ్డి నాగిరెడ్డి, మబ్బు నాధముని రెడ్డి, వెంకటేష్ రాయల్, వేమూరి జ్యోతి ప్రకాష్, అత్తూరు సురేష్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

## అఖిలేష్ యాదవ్ బర్త్ డే - గిఫ్ట్ గా విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు



ఉత్తర ప్రదేశ్, జులై 1: యూపీ బోర్డు పదో తరగతి..పన్నెండో తరగతిలో టాప్ అయిదుస్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ల్యాప్ టాప్ లు అందజేశారు

సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) చీఫ్ అఖిలేష్ యాదవ్.. తన 49వ జన్మదినం సందర్భంగా శుక్రవారం విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందచేశారు.

మొత్తం 30 మంది విద్యార్థులు అఖిలేష్ యాదవ్ నుంచి ల్యాప్‌టాప్‌లు స్వీకరించారు. రాష్ట్ర ప్రభుత్వం తన హామీని నెరవేర్చడం లేదని, తాము అధికారంలో లేకున్నా పాలకులకు వారి హామీలను గుర్తు చేసేందుకు ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేశామని అఖిలేష్ తెలిపారు. అఖిలేష్ బర్త్‌డే సందర్భంగా పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడంతో పాటు ప్రార్థనా స్థలాల్లో పూజలు నిర్వహించారు. పలు ప్రాంతాల్లో పేదలకు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. యూపీ సీఎం యోగి ఆదిత్యానాథ్ విపక్ష నేత అఖిలేష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## విజయవంతంగా 5 సంవత్సరాలు పూర్తి చేసుకున్న జీఎస్టీని ప్రశంసించిన ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, జులై 1: విజయవంతంగా 5 సంవత్సరాలు పూర్తి చేసుకున్న జీఎస్టీని ప్రధానమంత్రి ప్రశంసించారు. జీఎస్ టి అనేది ప్రధానమైన పన్ను సంస్కరణ అని, ఇది సులభతర వ్యాపారాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లిందని, ఒక దేశం, ఒకే పన్ను దార్శనికతను సాకారం చేసిందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మై గవ్ ద్వారా ఒక ట్వీట్ చేస్తూ,

"మనం జీఎస్టి అమలులోకి వచ్చి 5 సంవత్సరాలు పూర్తి చేసుకున్నాం. ఇది ఒక ప్రధాన పన్ను సంస్కరణ. సులభతర వ్యాపారాన్ని ఇది మరింత ముందుకు తీసుకువెళ్లింది. ఒక దేశం , ఒకే పన్నుదార్శనికతను సాకారం చేసింది."అని పేర్కొన్నారు.

## 'డాక్టర్డే' సందర్భంగా వైద్యులకు అభినందనలు తెలిపిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, జులై 1: 'డాక్టర్స్ డే' సందర్భం లో వైద్యుల కు ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. ప్రాణాల ను కాపాడడం లో మరియు ఈ భూమి ని ఆరోగ్యవంతమైంది గా తీర్చిదిద్దడం లో వైద్యులు పోషిస్తున్నటువంటి కీలకమైన పాత్ర కు వారి కి ప్రధాన మంత్రి అభినందనల ను వ్యక్తం చేశారు.

"కష్టించి పనిచేస్తున్నటువంటి వైద్యులు అందరి కి డాక్టర్స్ డే శుభాకాంక్షలు. ప్రాణాల ను కాపాడడం లో మరియు ఈ భూమి ని ఆరోగ్యవంతమైంది గా తీర్చిదిద్దడం లో వైద్యులు కీలకమైన భూమిక ను పోషిస్తుంటారు." అని పేర్కొన్నారు.






26

**"హలో... జయా! నేను విశ్వమోహన్‌ని. న్యూయార్క్ నుంచి మాట్లాడుతున్నాను. అమ్మ పార్వతి నీ గురించి ఈ మధ్యే చెప్పింది. అనుకోకుండా ఒక రోజు రాజశేఖర్, రమ్యలు కలిసిన్రు. తెలుగులో మాట్లాడుకుంటుంటే ముచ్చటేసి పలకరించిన. దాంతో వారి వివరాలు తెలిసినయి. అలా పరిచయం కాస్తా స్నేహంగా మారింది. రెండు, మూడుసార్లు వాళ్లింటికి పోయిన. మీ గురించి పూర్తి వివరాలు తెలిసినయి."**

జయ క్షణకాలం ఆశ్చర్యపోయింది. సంభ్రమంతో నోటమాట రాలేదు. రమ్య ఓసారి విశ్వమోహన్ కలిశాడని చెప్పింది గానీ ఇన్ని విషయాలు వాళ్లు మాట్లాడుకున్న విషయం తనకు తెలియదు. డైరెక్ట్‌గా ఇలా ఫోన్ చేస్తాడని తాను ఊహించలేకపోయింది. తనను తాను సంభాళించుకొని హలో అని పలకరించింది. అన్నయ్యా అని పిలవాలని అనిపించి కూడా ఎందుకో పిలవలేకపోయింది.

"హలో... నమస్కారం... మీ గురించి రమ్య ఒకసారి కలిసినట్టు చెప్పింది. అంతకుమించి మీ గురించిన వివరాలు నాకు తెలియదు" అంది జయ.

"జయా! మీరు అంటూ బహువచనం అక్కర్లేదు. అన్నయ్యా అని పిలిస్తే ఎక్కువ సంతోషిస్త. విజయేందర్ అన్నయ్య నాకన్నా ఏడాదే పెద్ద. నాకన్నా నువ్వు రెండేండ్లు చిన్నదానివి. అన్నయ్యా అని పిలిస్తే సంతోషిస్త" అంటూ విశ్వమోహన్ మధ్యలో ఆగిపోయాడు.

"అలాగే అన్నయ్యా..." కాస్త సందిగ్ధంగానే పలికింది జయ.

"జయా! నీవు తీసుకున్న నిర్ణయాన్ని నేను అభినందిస్తున్నాను. మన తల్లులు వేరయినా మన తండ్రి ఒక్కడే. నీకి విషయం ఎంతోకొంత తెలిసే ఉంటుంది. అమ్మ నన్ను సింగిల్ పేరెంట్‌గానే పెంచింది. ఏమైంది? క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత ఉద్యోగం సంపాదించుకున్న. యుఎస్‌ఎకు వచ్చినంక ఇక్కడే సెటిల్ అవుదామనిపించింది. ఇక్కడి వాతావరణం నాకు బాగా సూటైంది. అందుకని ఇక్కడే అపార్ట్‌మెంట్ తీసుకున్న. మొన్నీమధ్య రాజశేఖర్, రమ్య కూడా వచ్చి చూసి పోయిన్రు."

"ఊ.." అంటూ వింటూ ఉండిపోయింది జయ.

"జయా! ఎక్కువ చొరవ తీసుకుంటున్నానని అనుకోకపోతే ఒక మాట చెప్పనా?"

"చెప్పు.. అన్నయ్యా..." ఈసారి జయ మాటల్లో అన్నయ్యా అనే పిలుపులో ఆర్ద్రత పలికింది. అది విశ్వమోహన్ హృదయంలో సంతోషాన్ని నింపింది. ఉత్సాహంగా చెప్పుకొచ్చాడు విశ్వమోహన్.

"జయా! నీవు సింగిల్ పేరెంట్‌గా పిల్లల్ని పెంచితే ఏమైపోతారోనని బాధపడుతున్నట్టు రమ్య చెప్పింది. ఇందులో బాధపడవలసింది ఏమీ లేదు. నాన్న ఉండి కూడా నేను సింగిల్ పేరెంట్‌గానే పెరిగిన. నీకు ఆ విషయం తెలుసు. సింగిల్ పేరెంట్‌గా అమ్మ పెంచడంలో నేను పెరగడంలో కొన్ని కష్టాలు ఉన్నయి. ఆ విషయం కాదనను. తండ్రిలేని లేదా తల్లిలేని పిల్లలకు అనేక అసౌకర్యాలుంటయి. కొన్నిసార్లు అవమానాలు కూడా ఎదుర్కోవలసి వస్తుంది."

"అవును. మీరు ఎంత బాధపడ్డరో, అవమానాలకు గురి అయిన్రో నాకు బుద్ధి తెలిసిన తర్వాత ఊహిస్తేనే కష్టమనిపించింది. ఇప్పుడు ఇంకా ఎక్కువ తెలుస్తున్నది" అంది జయ.

"అయితే ఆ కష్టాలను మించిన లాభం కూడా జరిగింది. నేను స్వేచ్ఛగా పెరిగిన. అమ్మ దేన్నీ కట్టడి చేయలేదు. క్రమశిక్షణ పేరిట నన్ను హింసించలేదు. అందుకే నేను యుఎస్‌కు వచ్చినంకనే నాకు నచ్చిన అమ్మాయిని చూసి పెళ్లి చేసుకున్న. ఇద్దరం ఉద్యోగం చేస్తున్నం. హాయిగా ఉంది."

"అన్నయ్యా! గడిచిపోయిన కష్టాలు గుర్తు చేసుకుంటే ఆనందంగానే ఉంటుంది. సింధ్‌బాద్ నావికుడు తన ప్రయాణంలో ఎదుర్కొన్న కష్టాలను అన్నీ అధిగమించి ఒడ్డెక్కిన తర్వాత ఆ కథలన్నీ చెప్తుంటే వినే వాళ్లకు, చెప్పే వాళ్లకు అందరికీ ఆనందంగానే ఉంటుంది. అవన్నీ తీరిన కష్టాలు కదా!" అంది జయ.

> "ఈ నవలలో ఎన్నో పాత్రలు. కొన్ని సజీవ పాత్రలు. మరికొన్ని మాజీ ప్రధాని పీ.వీ. రాసిన 'లోపలి మనిషి' నవలలోలాగ సజీవ పాత్రలను కలగా పులగం చేసిన చిత్రణ. కొన్ని ఊహాత్మక పాత్రలు. కొన్ని ఆదర్శ పాత్రలు. వీటిక్కూడా మూలరూపాలు... లేకపోలేదు" అని రచయిత బి.యస్. రాములు అన్నారు. ఆలోచింపజేసి, చైతన్య పరచే ఈ 'చూపు' నవలను ప్రతిరోజు నేటినిజం పాఠకులకోసం...
> – సంపాదకులు.

## విశ్వం



– బి.ఎస్.రాములు
సామాజిక తత్వవేత్త
తొలి ఛైర్మన్, బీసీ కమిషన్, తెలంగాణ రాష్ట్రం
సెల్: 8331966987

"అదొక్కటే కాదు.. నాన్నతో కలిసి ఉంటే నేను ఇష్టపడిన అమ్మాయిని పెళ్లి చేసుకునే అవకాశం ఉండేదా? ఉండేది కాదని నీకు తెలుసు. విజయేందర్ అన్నయ్యకు తెలుసు. మీరు ఇష్టపడి ప్రేమించిన వాళ్లతో మీ పెళ్లి జరగలేదు. అందుకు నాన్న ఎలా చక్రం తిప్పిండో నీకు తెలుసు, అన్నయ్యకు తెలుసు. నాన్న పెంపకంలో నేను ఉండిఉంటే నాక్కూడా అదే గతి పట్టి ఉండేది. అందువల్ల ఇలా కొన్ని సౌకర్యాలు, స్వేచ్ఛలు సింగిల్ పేరెంట్‌గా పెరగడంలో అనుకోకుండానే అనుభవించాను. నాకు ఇష్టమైన పద్ధతిలో పెళ్లి చేసుకున్న. మీరు ఇష్టమైన పెండ్లిళ్లు చేసుకోగలిగిన్రా? ఖాన్‌దాన్ పేర, వంశంపేర, కులం పేర, ప్రతిష్ట పేర, ఆస్తి, అంతస్తుల పేర, మీ ప్రేమలు పెళ్లి దాకా రాకుండా పోయినయి. అందుకు కారణమెవరు? నాన్న కాదా..?"

అంత స్పష్టంగా చెప్తుంటే కాదనడానికి ఏముంది? ఊ కొడుతూ పోయింది జయ.

అవన్నీ గుర్తొచ్చి కాసేపు విషాదంగా మారిపోయింది. విశ్వం అది

> **"కొన్ని సౌకర్యాలు, స్వేచ్ఛలు సింగిల్ పేరెంట్‌గా పెరగడంలో అనుకోకుండానే అనుభవించాను. నాకు ఇష్టమైన పద్ధతిలో పెళ్లి చేసుకున్న. మీరు ఇష్టమైన పెండ్లిళ్లు చేసుకోగలిగిన్రా?"**

గమనించినట్టున్నాడు. అనునయంగా కాసేపు సముదాయించాడు. ఊరడించాడు.

"జయా! జరిగింది వెనక్కి రాదు. గతం గతః. ఇప్పుడు నీవు సింగిల్ పేరెంట్‌గా బతకదల్చుకుంటే నా మద్దతు ఉంటుంది. అన్ని విధాలా సహకరిస్తా. నీకు కష్టం అనిపించినప్పుడల్లా ఈ చిన్నన్నయ్య ఉన్నాడని మర్చిపోకు."

"అలాగే అన్నయ్యా!"

"విజయేందర్ అన్నయ్య ఇష్టపడి పెళ్లి చేసుకుందామనుకున్న నీహారిక ఇక్కడే యుఎస్‌ఎలో ఉంటున్నది. నీహారిక కూడా ఫోన్‌లో టచ్‌లో ఉంది. ఆమె మీ ఫర్మ్‌లో కొంత ఇన్వెస్ట్ చేస్తున్నట్టు చెప్పింది. రమ్య కూడా ఇన్వెస్ట్ చేస్తున్నట్టు చెప్పింది. కంగ్రాట్స్..."

"థాంక్స్ అన్నయ్యా!"

"జయా! నీవు ఒంటరివి కావు. నీకు ఎంతో స్నేహ బృందం ఉంది. ఇక్కడ యుఎస్‌ఎలో ఇంకా నీకు సహకరించే వాళ్లు చాలామందే ఉన్నరు."

ఆ మాటతో జయకు ఎంతో ధైర్యం వచ్చింది. తన కాళ్లమీద తాను నిలబడగలను అని పూర్తి విశ్వాసం ఏర్పడింది.

"జయా! రెండు ప్రపంచ యుద్ధాల పరిణామాల అనంతరం యూరప్‌లో, అమెరికాలో, రష్యాలో ముప్పై శాతం మంది యువతరం సింగిల్ పేరెంట్‌గా పెంచబడిన వాళ్లే. అమెరికా చరిత్రను మార్చిన నాటి అధ్యక్షుడు అబ్రహం లింకన్ కూడా సింగిల్ పేరెంట్‌గా పెరిగిండు. తల్లి అతడ్ని పెంచి పోషించింది. ఎన్ని కష్టాలు ఎదురైనా ఎదుగుతూనే వచ్చిండు."

"అలాగా..." అంటూ ఆశ్చర్యపోయింది జయ. మళ్లీ కొనసాగించాడు విశ్వం.

"జయా! ఆ మాటకు వస్తే మన ఇండియాలో కూడా సింగిల్ పేరెంట్‌గా పెరగడం, పెంచడం కొత్తేమీ కాదు. మౌర్య చంద్రగుప్తుడు కూడా తల్లి మురా ఒడిలో సింగిల్ పేరెంట్‌గానే పెరిగిండు. ఏసుక్రీస్తు కూడా సింగిల్ పేరెంట్‌గానే పెరిగిండు.




ఆంజనేయుడు తల్లి అంజనీదేవి పెంపకంలో సింగిల్ పేరెంట్‌గానే పెరిగిండు. లవకుశలు కూడా తల్లి సీత పెంపకంలో సింగిల్ పేరెంట్ పెంపకంలోనే పెరిగిన్రు. వీరంతా మహావీరులు. జాబాలి, ద్రోణుడు కూడా సింగిల్ పేరెంట్‌గానే పెరిగిన్రు. జాబాలి మహాజ్ఞాని అయిండు. ద్రోణుడు మహాయోధుడై విలువిద్యలు నేర్పిండు.

శివుడు కూడా సింగిల్ పేరెంట్‌గానే పెరిగిండు. అందుకే స్వేచ్ఛగా శ్మశానాల వెంట భయం లేకుండా తిరిగిండు. తల్లిదండ్రులు క్రమశిక్షణలో పెంచితే శివుడ్ని శ్మశానాలకు పోనిచ్చే వాళ్లా?

పాండవులు కూడా తల్లి కుంతి పెంపకంలో సింగిల్ పేరెంట్ పెంపకంలోనే పెరిగిన్రు. అభిమన్యుడి కొడుకు పరీక్షిత్తును అభిమన్యుడు యుద్ధంలో చనిపోయాక తల్లి శశిరేఖ సింగిల్ పేరెంట్‌గానే పెంచింది.

మేనక కని వదిలేసి పోతే శకుంతల కణ్వ ముని ఆశ్రమంలో సింగిల్ పేరెంట్‌గానే పెరిగింది. భరతుడు కూడా శకుంతల పెంపకంలో సింగిల్ పేరెంట్‌గానే పెరిగిండు. దుష్యంతుడు పెద్ద పెరిగినంక మాత్రమే భరతుడ్ని దగ్గరకు తీసిండు. ఇలా రామాయణ, మహాభారతాలు, భరత వంశాలు సింగిల్ పేరెంట్ పెంపకంలోనే పెరిగి వారసత్వాన్ని నిలిపిన్రు. పెద్దలకు కీర్తిని తెచ్చిన్రు."

ఇవన్నీ తెలిసిన విషయాలే. కానీ ఈ కోణంలో ఎవరూ ఆలోచించినట్టు లేరు. అవసరం కలిగినప్పుడే కొత్త కోణాల్లో ఆలోచిస్తామేమో. విశ్వం చెపుతుంటే చాలా ఆసక్తిగా ఉంది జయకు.

"జయా! చక్రవర్తి అక్బర్ కూడా సింగిల్ పేరెంట్‌గానే పెరిగిండు. మహాత్మా జ్యోతిరావు పూలే కూడా తల్లి చనిపోతే తండ్రి ఒడిలో సింగిల్ పేరెంట్‌గానే పెరిగిండు. అంతెందుకు ఇందిరాగాంధీ పిల్లలు రాజీవ్‌గాంధీ, సంజయ్ గాంధీలు కూడా సింగిల్

> **యుద్ధానంతరం మిగిలేది వితంతువులే. వారి పిల్లలంతా సింగిల్ పేరెంట్‌గానే పెరిగిన్రు. రెండు ప్రపంచ యుద్ధాల్లో ఐదు కోట్ల మంది చనిపోతే వారి పిల్లలంతా తల్లి ఒడిలో, అమ్మమ్మ, నాన్నమ్మ ఒడిలో సింగిల్ పేరెంట్‌గానే పెరిగిన్రు.**

పేరెంట్‌గానే పెరిగిన్రు.

ప్రకృతిలో, పశుపక్ష్యాదుల్లో, జంతువుల్లో కూడా సింగిల్ పేరెంట్ పెంపకమే కదా! దాన్ని సహజంగానే చూస్తున్నం. తల్లి కోడి కూడా తన పిల్లల్ని సింగిల్ పేరెంట్‌గానే పెంచుతుంది.

యుద్ధానంతరం మిగిలేది వితంతువులే. వారి పిల్లలంతా సింగిల్ పేరెంట్‌గానే పెరిగిన్రు. రెండు ప్రపంచ యుద్ధాల్లో ఐదు కోట్ల మంది చనిపోతే వారి పిల్లలంతా తల్లి ఒడిలో, అమ్మమ్మ, నాన్నమ్మ ఒడిలో సింగిల్ పేరెంట్‌గానే పెరిగిన్రు. భర్త చనిపోయి వితంతువులైన వాళ్లు తమ పిల్లల్ని సింగిల్ పేరెంట్‌గనే గదా పెంచింది. రెండు ప్రపంచ యుద్ధాలనంతరం కాల పరిణామంలో సింగిల్ పేరెంట్‌గా పెరిగిన పిల్లలు అనుభవించిన స్వేచ్ఛ, ముఖ్యంగా స్త్రీలు అనుభవించిన స్వేచ్ఛ నుండి సింగిల్ పేరెంట్‌గానే తమ పిల్లల్ని పెంచుకోవాలనే ఇష్టం కూడా పెరిగినట్టుంది. ఆ కష్టాన్ని ఇష్టంగా భరిస్తూ స్త్రీల హక్కులను, స్వేచ్ఛను, ఆత్మగౌరవాన్ని కాపాడుకుంటూ వస్తున్నరు. అలా ఫెమినిజం స్పష్టంగా రూపుదిద్దుకోవడంలో రెండు ప్రపంచ యుద్ధాల పరిణామాల పాత్ర తక్కువేమీ కాదు."

ఫెమినిజానికి విశ్వం చూపిస్తున్న కొత్తకోణం చిత్రంగా ఉంది. యుద్ధాలు అనేక పరిణామాలకు దారితీస్తాయి. రెండో ప్రపంచ యుద్ధం తరువాత ఐక్యరాజ్యసమితి ఏర్పడింది. అనేక దేశాలు స్వాతంత్ర్యం పొందినయి. సింగిల్ పేరెంట్ పెంపకాన్ని ముందుకు తెచ్చిన ఫెమినిజం కూడా రెండు ప్రపంచ యుద్ధాల పరిణామాల పర్యవసానమే అని చెప్పడం కొత్త కోణమే అనుకుంది జయ. ఆ మాటే విశ్వంతో అంది. విశ్వం మళ్లీ మరికొంత వివరించి ప్రస్తుత సమస్యకు వచ్చాడు.

"జయా! అందుకని నువ్వు రత్నాకర్‌తో విడిపోయి తప్పు చేశానని బాధపడాల్సిందేమీ లేదు. భర్త అనే బరువు దిగిపోతుంది. బాధ్యతలు రెట్టింపవుతయి అంతే.

నేను భరతుడిలాగా అమ్మ ఒడిలో సింగిల్ పేరెంట్‌గానే పెరిగిన. నాకు నాన్న ఉన్నప్పటికీ, లేనివాడినే కదా! ఆ బాధ కొంత ఉంటుంది. భక్త ధ్రువుడు తండ్రి ప్రేమకు నోచుకోలేక ఘోర తపస్సు చేసిండు. ధ్రువతారగా నిలిచిపోయిండు. ఇలా తండ్రిలేని లేదా తల్లి లేని శూన్యాన్ని సృజనాత్మకత, స్వేచ్ఛ, అభిరుచులు, ఉదాత్త లక్ష్యాలు, పట్టుదల మొదలైనవి పూరిస్తయి. ప్రశంస అనేది వారి జీవితంలో గొప్ప స్ఫూర్తినిస్తుంది.

తల్లిదండ్రులున్న పిల్లలు క్రమశిక్షణతో చక్కగా పెరగవచ్చు. కానీ వారికి స్వేచ్ఛ తక్కువ. క్రమశిక్షణ పేర అనేక విధి నిషేధాలు సింగిల్ పేరెంట్‌గా నాకున్న స్వేచ్ఛ వారికుండేది కాదు. నాలాగా మొండి ధైర్యం, పట్టుదల, ఆత్మవిశ్వాసం, తెగింపు వాళ్లకుండేది కాదు. జీవితంలో ఇవే ముఖ్యం. ఇవి నీ పిల్లలకు అందిస్తే చాలు."

"జయా! ఇక నుంచి నీకు అన్నయ్యలు ఇద్దరు అని గుర్తుంచుకో!"

"అలాగే.. అన్నయ్యా...! మీరందరు ఇంత అండగా ఉన్నప్పుడు నేను తప్పకుండా ముందుకు సాగుత. మహిళా అర్బన్ బ్యాంక్ స్టార్ట్ చేయాలనుకుంటున్నా. బలార్షా, నాగపూర్‌ల్లోని ఫర్మ్‌ని ఇంకా విస్తరించాలని అనుకుంటున్న. మీ అందరి సహకారం తప్పక ఉండాలి" అంది జయ.

"కంగ్రాట్స్! మా సహకారం తప్పకుండా ఉంటది. గో యే హెడ్" అంటూ ఆశీర్వదిస్తూ, అభినందిస్తూ ఫోన్ పెట్టేశాడు విశ్వం.

ఫోన్ పెట్టేశాక జయలో ఉత్సాహం, ఆనందం రెట్టింపయ్యింది. అనుకోని చోటు నుండి సహకారం, మద్దతు అందడం అనిర్వచనీయంగా ఉంది. ఆ సంతోషాన్ని పంచుకోవడానికి ఎవరూ కనిపించలేదు.

వెంటనే రమ్యకు ఫోన్ కలిపి రమ్యతో, రాజశేఖర్‌తో మాట్లాడింది. థ్యాంక్స్ చెప్పింది. మానసకు ఫోన్ చేసేదాకా జయ మనస్సు మనస్సులో లేదు. వెంటనే మానసకు ఫోన్ కలిపి జరిగిన విషయం ఆనందంగా చెప్పింది జయ.

"జీవితం ఎన్ని మలుపులు తిరుగుతుందో... ఆశ్చర్యంగా ఉంది కదే..." అంది మానస.

"అవును. మనం జీవితం గురించి అనుకున్నది ఒకటి. జరుగుతున్నది మరొకటి. అనుకున్నదానికి, జరుగుతున్న దానికి మధ్య సంఘర్షణను ఎదుర్కొని జీవితాన్ని గెలుచుకోవడమే మనిషి విజయానికి చిహ్నం." అంది జయ.

మానస నవ్వింది. విషాదం జీవితంలో తాత్త్వికతని పెంచుతుందని ఎక్కడో, ఎప్పుడో చదివింది గుర్తుకు తెచ్చుకుంది మానస. అదే మాట అంది.

"కష్టాలు ఎదురైన కొద్దీ నీకు తత్త్వం బాగా పెరుగుతున్నదే"

"అదేం కాదే. జీవితానుభవాలు అనేక తత్త్వాలను నేర్చుకోమంటయి. అంతదాకా అర్థంకాని విషయం అప్పుడే కొత్తగా అర్థమవుతది. అన్నయ్య చూడు... మనకు తెలిసిన రామాయణ, భారతాల నుంచి, చరిత్ర నుంచి సింగిల్ పేరెంట్ గురించి ఎన్ని విషయాలు చెప్పిండే. అన్నయ్యకు అది జీవితావసరంగా అనుభవంలోకి వచ్చింది. ఇప్పుడు నాకు అవి అర్థమయ్యే అవసరం ఏర్పడ్డది"

"ఏమైనా... నాకింకా నీ ఆలోచనను పూర్తిగా సమర్థించాలనిపించడం లేదు. అన్నీ ఉండి సింగిల్ పేరెంట్‌గా విడిపోవలసిన దుస్థితి రావడం పట్ల నాకు బాధగా ఉంది. అరిగించుకోలేకపోతున్న" అంది మానస.

"మానసా! నీ నుండి ఇలాంటి నిరాశాపూరిత మాటలు నేను కోరుకోను. నా మీద సానుభూతి వద్దు. సానుభూతి చూపిస్తే నేను ఓడిపోతాను. నేను ఓడిపోవాలని కోరుకుంటున్నవా?"

"ఛ.. అదేం మాటనే...? సానుభూతి మనిషికి ఓడిపోయే జీవితాన్ని ఇస్తుందని నాకింత దాకా తెలియదే. సారీ.. నువ్వు ఏ నిర్ణయం తీసుకున్నా మంచిదే. నేను, సుధాకర్, రాజేశ్వరి అందరం నీకు పూర్తిగా మద్దతుగా ఉంటాము. అన్ని విధాలుగా సహకరిస్తాం. నువ్వు వేరు.. మేము వేరు కాదు. మహిళా బ్యాంక్‌కు నేను కూడా సహకరిస్త" అంది మానస.

"థ్యాంక్సే..! అన్నయ్యకు, మనోజ్‌కు కూడా ఈ విషయాలు చెప్పు. నా నిర్ణయానికి సహకరించేటట్టు చూడు" అంది జయ.

"అలాగే.. తప్పకుండా" అంటూ ఫోన్ పెట్టేసింది మానస.





# ఆషాఢంలో ఆడపిల్లలు గోరింటాకు ఎందుకు పెట్టుకోవాలి?

హైదరాబాద్, జులై 1: గోరింటాకు ఇప్పుడంటే కోన్లు..రెడీమేడ్ లు వచ్చాయి ..కానీ అప్పట్లో ఎంచక్కా గోరింటాకుని ఏరి తెచ్చుకుని రోటిలో రుబ్బుకుని మరీ పెట్టుకునేవారు ఆడపిల్లలు. ఇప్పుడంత టైం లేదనుకోండి. అయితే ఈ గోరింటాకుకి ఓ ప్రత్యేకత ఉంది. ఎటువంటి శుభకార్యంలోనైనా ముందుండేది ఈ గోరింటాకే. మరీ ముఖ్యంగా ఆషాఢమాసం వచ్చిందంటే చాలు ఆడబిడ్డలు తమ చేతులకు గోరింటాకు పెట్టుకుంటుంటారు. అయితే, ఆషాఢంలో గోరింటాకు పెట్టుకోవడం వెనుక పెద్ద కారణమే ఉంది. మహిళలు గోరింటాకు పెట్టుకోవడం వెనుక ఒక ప్రయోజనమే ఉంది. సాధారణంగా ఆషాఢమాసంలో వర్షాలు పడుతుంటాయి. దీంతో సూక్ష్మజీవులు, అంటువ్యాధులు పెరిగే అవకాశం ఉంటుంది. కాగా మహిళలు ఎక్కువగా నీటితో పనిచేస్తుంటారు. కాబట్టి వారి చేతులు, కాళ్లు ఎప్పుడూ తడిగానే ఉంటాయి. దీనివల్ల వాళ్లు తొందరగా వ్యాధుల బారిన పడే అవకాశం ఉంటుంది. కాబట్టి గోరింటాకు పెట్టుకుంటే అనారోగ్యం బారిన పడకుండా ఉండొచ్చని ఆయుర్వేదం చెబుతోంది.

స్త్రీ అరచేతి మధ్యలో గర్భాశయానికి రక్తం చేరవేసే ప్రధాన నాడులు ఉంటాయి. గోరింటాకు పెట్టుకోవడం వల్ల వాటిలోని అతి ఉష్ణాన్ని లాగేస్తుంది. దీనివల్ల గర్భాశయ దోషాలు తొలగుతాయట. ఇక గోరింటాకు గౌరీదేవి ప్రతీక. గౌరి ఇంటి ఆకు.. గోరింటాకుగా మారిందని మన పురాణాలు చెబుతున్నాయి. గోరింటాకు పుట్టుక వెనుక ఒక కథ ఎక్కువగా ప్రాచుర్యంలో ఉంది. అదేంటంటే.. గౌరీ దేవి బాల్యంలో తన చెలికత్తెలతో కలిసి వనంలో ఆటలాడే సమయంలో రజస్వల అవుతుంది. ఆ సమయంలో గౌరీ దేవి రక్తపు చుక్క నేలను తాకగానే ఓ మొక్కగా ఉద్భవించింది. ఆ వింతను చూసిన చెలికత్తెలు పరిగెత్తుకుంటూ వెళ్లి పర్వతరాజుకు ఈ విషయం చెబుతారు. సతీసమేతంగా పర్వతరాజు.. వనానికి వచ్చేసరికి ఆ మొక్క పెరిగి పెద్ద చెట్టు అవుతుంది. అప్పుడు ఆ చెట్టు సాక్షాత్తు పార్వతి రుధిరాంశతో జన్మించాను. నా వల్ల ఈ లోకంలో



ఏదైనా ఉపయోగం ఉందా అని అడుగుతుంది. అప్పుడు గౌరీ దేవి చిన్న పిల్లల చేష్టలతో ఆ చెట్టు ఆకు కోస్తుంది. ఆ ఆకు తగలగానే గౌరీదేవి వేళ్లు ఎర్రబడిపోతాయి. అది చూసిన పర్వతరాజు దంపతులు.. అయ్యో బిడ్డ చెయ్యి కందిపోయిందే అని విచారం వ్యక్తం చేసేలోపే.. గౌరీదేవి తనకు ఎలాంటి హాని కలగలేదని చెబుతుంది. పైగా ఈ రంగు చాలా అలంకారంగా అనిపిస్తుందని అంటుంది. అప్పుడు పర్వతరాజు ఉండి.. ఇకపై స్త్రీ సౌభాగ్యానికి చిహ్నంగా ఈ గోరింటాకు భూలోకంలో ప్రసిద్ధి చెందుతుందని చెప్పారట. స్త్రీల గర్భాశయ దోషాలను తొలగిస్తుందని చెప్పారట. ఈ గోరింటాకుని ఆడవారు ఎంతో ముచ్చటపడి పెట్టుకుంటారు. ఇది సంప్రదాయమే కాదు..ఆరోగ్యం కూడా.

# 3న పరేడ్ గ్రౌండ్స్‌లో బీజేపీ సభ.. భద్రత కట్టుదిట్టం చేసిన పోలీసులు

హైదరాబాద్, జులై 1: ఈ నెల 3వ తేదీన పరేడ్ గ్రౌండ్స్‌లో బీజేపీ నిర్వహించే సభకు ప్రధాని నరేంద్ర మోదీ హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో పరేడ్ గ్రౌండ్స్ లో బీజేపీ నేతలతో కలిసి నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. పరేడ్ గ్రౌండ్స్‌లో సభ ముగిసిన అనంతరం ప్రధాని నేరుగా రాజ్‌భవన్‌కు వెళ్తారని చెప్పారు. ఆదివారం రాత్రి రాజ్‌భవన్‌లో ప్రధాని బస చేస్తారని తెలిపారు. హెచ్ఐసీసీ, బేగంపేట, రాజ్‌భవన్ మార్గాల్లో 4 వేల మంది పోలీసులతో పహారా కల్పిస్తున్నామని స్పష్టం చేశారు. సభకు వచ్చే వాహనాలకు కంటోన్మెంట్, జీహెచ్ఎంసీ ఏరియాల్లో పార్కింగ్ స్థలాలను కేటాయించామని తెలిపారు. ట్రాఫిక్ కంట్రోల్ కోసం ఇతర జిల్లాల నుంచి అధికారులను పిలిపించామని పేర్కొన్నారు. పరేడ్ గ్రౌండ్ పరిసరాల్లో 3 వేల మందితో భద్రత కల్పిస్తున్నట్లు తెలిపారు. డీఐజీ, ఎస్పీ, ఏసీపీ స్థాయి అధికారులను సెక్టార్ ఇంచార్జులుగా నియమించామని సీవీ ఆనంద్ చెప్పారు.

# తెలంగాణకు మోదీ రాకకు ముందు బీజేపీకి మరో షాక్.. టీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ కార్పొరేటర్



హైదరాబాద్, జులై 1: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పర్యటనకు ముందు బీజేపీ పార్టీకి షాక్ ల మీద షాక్ లు తగులుతున్నాయి. నిన్న హైదరాబాద్ లోని పలువురు బీజేపీ కార్పొరేటర్లు టీఆర్ఎస్ లో చేరగా ఈ రోజు ఐటీ, పురపాలక మంత్రి టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ.రామారావు సమక్షంలో వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆధ్వర్యంలో వరంగల్ కు చెందిన బీజేపీ 27వ డివిజన్ కార్పొరేటర్ చింతాకుల అనీల్, బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు చింతాకుల సునీల్ టీఆర్ఎస్ లోకి చేరారు.ప్రధాని నరేంద్ర మోదీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేఖ విధానాలు నచ్చక, తెలంగాణపై మోదీ చూపుతున్న వివక్షకు నిరసనగా ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో మంత్రి కే.టీ.ఆర్ నేతృత్వంలోనే తెలంగాణా అభివృద్ధి సాధ్యమని బీజేపీని వీడి టీఆర్ఎస్ చేరుతున్నట్టు వారు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, ఎంపీ పసునూరి దయాకర్, ఎమ్మెల్సీ బండా ప్రకాష్, మాజీ మార్కెట్ కమిటి ఛైర్మన్ టీ.రమేష్ బాబు, టీఆర్ఎస్ నాయకుడు గందె నవీన్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# గోదావరిలోకి పోటెత్తిన వరద

నిజామాబాద్, జులై 1: గోదావరి నదిపై మహారాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన బాబ్లీ ప్రాజెక్టు గేట్లను అధికారులు ఎత్తివేశారు. దీంతో నదిలోకి వరద ప్రవాహం మొదలైంది. జిల్లాలోని రెంజల్ మండలం కందుకుర్తి త్రివేణి సంగమం వైపు నీరు పోటెత్తింది. ఈ నేపథ్యంలో రైతులు, జాలర్లు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చిరంచారు. బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తివేయడం ద్వారా ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, నిజామాబాద్ జిల్లాలోని ఆయకట్టుకు సాగునీరు అందనుంది. సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం ప్రతి ఏడాది జులై 1 నుంచి అక్టోబర్ 28 వరకు అధికారులు ప్రాజెక్టు గేట్లను ఎత్తి ఉంచుతున్న విషయం తెలిసిందే.

ఎస్సారెస్పీకి 80 కిలోమీటర్ల దూరంలో మహారాష్ట్రలోని ధర్మాబాద్ సమీపంలో బాబ్లీ ప్రాజెక్టును ఆ రాష్ట్ర ప్రభుత్వం నిర్మించింది. దీంతో ఎస్సారెస్పీకి వచ్చే వరదకు అడ్డుకట్ట పడిందని, ఆయకట్టుప్రశ్నార్థకంగా మారే అవకాశముందంటూ గత ప్రభుత్వాలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. దీనిపైవిచారించిన అత్యున్నత న్యాయస్థానం.. ప్రతిఏటా జులై 1 నుంచి అక్టోబర్ 28 వరకు బాబ్లీ ప్రాజెక్టు గేట్లుతెరిచి ఉంచాలని ఆదేశాలు జారీ చేసింది. బాబ్లీ గేట్ల ఎత్తివేత, మూసివేత ప్రక్రియలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర అధికారులతో పాటు సీడబ్ల్యూసీ (సెంట్రల్ వాటర్ కమిషన్) అధికారులు పాల్గొంటారు.బాబ్లీ ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటిమట్టం 2.7 టీఎంసీలు కాగా గురువారానికి ఒక టీఎంసీ నీటి నిల్వ ఉంది.గేట్లు ఎత్తితే గోదావరి ద్వారా నీరు ఎస్సారెస్పీలోకి చేరుతుంది. గతేడాది బాబ్లీ ప్రాజెక్టులో సీజన్‌ప్రారంభంలోనే అత్యధిక వర్షాలు కురిసి పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకుంది. వరద ఎక్కువ కావడంతోదిగువకు 14 గేట్లను క్రమంగా ఎత్తి నీటిని విడుదల చేశారు. ఈ ఏడాది ఆ పరిస్థితి లేకపోవడంతో ప్రాజెక్టులోనీటి మట్టం ఆశించిన స్థాయిలో లేదు.



# పది ఫలితాలలో చతికిలబడ్డ హైదరాబాద్..

హైదరాబాద్, జులై 1: పదవతరగతి ఫలితాల్లో 79.63 శాతం ఉత్తీర్ణత సాధించి హైదరాబాద్ జిల్లా రాష్ట్ర స్థాయిలో చిట్ట చివరి స్థానంలో నిలిచింది. గురువారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పది ఫలితాలను ప్రకటించారు. మే 23 నుంచి జూన్ 1 వరకు జరిగిన పరీక్షల్లో 90 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా అందులో 87.61 శాతం బాలురు, 92.85 శాతం బాలికలు ఉత్తీర్ణత సాధించారు. రాష్ట్రంలో సిద్దిపేట జిల్లా 97.85 శాతం ఉత్తీర్ణత సాధించి మొదటి స్థానంలో నిలవగా, 79.63 శాతం ఉత్తీర్ణత సాధించి హైదరాబాద్ చివరి స్థానంలో నిలిచింది.

హైదారబాద్ జిల్లాలో 36633 బాలురు, 37324 బాలికలు కలిపి మొత్తం 73957 విద్యార్థులు పరీక్షకకు హాజరు కాగా 58889 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. అందులో 27400 బాలురు కాగా 31489 బాలికలు ఉన్నారు. సగటున 74.8 శాతం బాలురు, 84.37 శాతం బాలికలు ఉన్నారు. హైదరాబాద్ జిల్లా పదవతరగతి ఫలితాల్లో రాష్ట్రంలోనే చివరి స్థానంలో నిలవడానికి జిల్లా విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యమే కారణమని తెలుస్తోంది. ఇదిలా ఉండగా ఆగస్టు 1నుంచి అడ్వాన్స్డ్ సప్లమెంటరీ పరీక్షలు ఉంటాయని ప్రభుత్వం ప్రకటించింది.

# కర్మాగారంలో గ్యాస్ లీక్.. ఐదుగురు కూలీలకు అస్వస్థత



హైదరాబాద్, జులై 1: కర్మాగారంలో గ్యాస్ లీకై ఐదురుగు కూలీలు అస్వస్థతకు గురైన ఘటన నెల్లూరు జిల్లాలో చోటుచేసుకుంది. పంటపాలెం పంచాయతీలోని ఓ కర్మాగారంలో బిహార్‌కు చెందిన కార్మికుడు బాయిలర్ సమీపంలోని బావిలో దిగి పనులు పరిశీలిస్తుండగా గ్యాస్ లీకై అపస్మారక స్థితిలోకి వెళ్లాడు.

ఇది గమనించిన మరో నలుగురు కార్మికులు వ్యక్తిని కాపాడేందుకు బావిలో దిగి అస్వస్థతకు గురయ్యారు. మొత్తం ఐదుగురు కార్మికులు అస్వస్థతకు గురికాగా.. వెంటనే స్పందించిన సహచర కార్మికులు బాధితులను నెల్లూరు ఆసుపత్రికి తరలించారు. వారిని పరీక్షించిన వైద్యులు ప్రాణాపాయం లేదని ప్రకటించారు. సంఘటనపై విచారణ చేస్తున్నామని, ఎవరికి ఎలాంటి ప్రాణహాని లేదని ఎస్పై శివరామకృష్ణ తెలిపారు.

# వాటర్ స్పోర్ట్స్ అకాడమి క్రీడా పాఠశాలలో ప్రవేశానికి షెడ్యూలు..

మెదక్, జులై 1 (నేటినిజం ప్రతినిధి): గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా 2022-23 సంవత్సరానికి ఆశ్రమ పాఠశాల బోయినపల్లి నందు వాటర్ స్పోర్ట్స్ అకాడమి ప్రారంభించడం జరిగిందని వాటర్ స్పోర్ట్స్ లో గిరిజన బాల, బాలికలకు శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి ఫిరంగి ఒక ప్రకటనలో తెలిపారు. కామకింగ్, కేనోఇంగ్, సెయిలింగ్ తదితర క్రీడల్లో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. వాటర్ స్పోర్ట్స్‌లో ప్రవేశం పొందేందుకు విద్యార్థినీ విద్యార్థుల ఎత్తు, బరువు స్టాండింగ్ బ్రాడ్ జంప్, వర్టికల్ జంపు, మెడిసిన్ బాల్ త్రో 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్, 800 మీటర్ల పరుగు పందెం పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిభ ఆధారంగా ఐదవ తరగతిలో 20 మంది బాలికలకు, 20 మంది బాలురకు ప్రవేశం కల్పిస్తామని అన్నారు.

శిక్షణ సమయంలో బాల, బాలికలకు ప్రత్యేకమైన వసతి, ఆహారం, స్పోర్ట్స్ దుస్తులు, షూస్ ఇవ్వనున్నట్లు తెలిపారు. నాలుగో తరగతి పాసై ఐదవ తరగతి చదువుతున్న ఆసక్తిగల విద్యార్థులు రెండు పాస్ పోర్ట్ సైజు ఫోటోలు, బోనఫైడ్ ఆధార్ కార్డు జిరాక్స్ కాఫీలతో హాజరుకావాలన్నారు.. మండల స్థాయి ఎంపికలు 05.07.2022 నుండి 08.07.2022 వరకు,. జిల్లాస్థాయి ఎంపికలు 13.07.2022 నుండి 15.07.2022 వరకు, తుది ఎంపిక 18.07.22 నుండి 22.07.2022 వరకు స్పోర్ట్స్ స్కూల్ హకీంపేట హైదరాబాద్ లో జరుగుతాయన్నారు. మరిన్ని వివరాలకు సంగారెడ్డిలోని గిరిజన అభివృద్ధి అధికారిని సంప్రదించాలని తెలిపారు.

# డైకిన్‌తో నైపుణ్యాభివృద్ధి సంస్థ ఒప్పందం.. డిప్లమో విద్యార్థులకు 500 ఉద్యోగాలు

అమరావతి, జులై 1: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణభివృద్ధి సంస్థ డైకిన్ తో ఒప్పందం కుదుర్చుకుంది. 75 శాతం స్థానిక యువతకు ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా ఏపీ నైపుణ్య అభివృద్ధి సంస్థ ఎండి సత్యనారాయణ సమక్షంలో డైకిన్ సంస్థ ప్రతినిధులు గురువారం అవగాహనకు వచ్చారు. ఈ సందర్భంగా ఆ సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ 2020 మరియు 21 డిప్లమా పూర్తి చేసుకున్న విద్యార్థులకు తమ సంస్థలో 500 ఉద్యోగాలు కల్పిస్తామని తెలియజేశారు.

వారికి తమ సంస్థలో శిక్షణ ఇచ్చి సంవత్సరానికి వార్షిక వేతనం 1,99,000.ఇస్తామని తెలిపారు. డిప్లమా పూర్తయిన విద్యార్థులకు జాబ్ మేళాల ద్వారా ఉద్యోగాలు కల్పిస్తామని ఎండీ సత్యనారాయణ చెప్పారు. అందుకు అవసరమైన కార్యచరణ రూపొందించామన్నారు.


ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ఆధ్వర్యంలో
42వ కార్యక్రమం




డా. వి. వెంకటేశ్వర - హిందీ హైకూ
శబ్ద్ కే పరే
గ్రంథావిష్కరణ సభ

సభాధ్యక్షులు: శ్రీ సోమేపల్లి వెంకట సుబ్బయ్య
అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం

పుస్తక ఆవిష్కర్త: డా॥ గుమ్మా సాంబశివరావు గారు
ప్రముఖ సాహితీవేత్త

గ్రంథ సమీక్షకులు: డా॥ పేరిశెట్టి శ్రీనివాసరావు గారు
సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్
దక్షిణ భారత హిందీ ప్రచార సభ, మద్రాసు

రచయిత స్పందన: శ్రీ ఉప్పలధడియం వెంకటేశ్వర గారు

తేది: 10 జూలై 2022 ఆదివారం సాయంత్రం 5 గంటలకు
వేదిక: జూమ్ అంతర్జాల వేదిక, ఐ.డి. 882 881 0417
పాస్‌వార్డ్ .123456

అందరికీ ఇదే మా ఆహ్వానం

ఎస్.ఎమ్.సుభాని - కార్యదర్శి
బొమ్ము ఉమామహేశ్వరరెడ్డి - కోశాధికారి
చలపాక ప్రకాష్ - ప్రధాన కార్యదర్శి


# ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం : మంత్రి పువ్వాడ



ఖమ్మం, జులై 1: (నేటినిజం ప్రతినిధి): సామాన్యుడికి అధునాతనమైన, మెరుగైన వైద్యం అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం అని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. రఘునాథపాలెం మండలం కేంద్రంలో రూ.20 లక్షలతో నిర్మించిన ప్రాథమిక అరోగ్య ఉప కేంద్రంను మంత్రి పువ్వాడ ప్రారంభించారు. ఖమ్మం కార్పోరేషన్ 16వ డివిజన్ లో రూ.16 లక్షలతో ఏర్పాటు చేసిన ప్రాథమిక అరోగ్య ఉప కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్య రంగాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని వైద్య రంగాన్ని అత్యుత్తమంగా తీర్చిదిద్దడం, పేదలు, సామాన్యులకు చెంతనే కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వ వైద్యాన్ని క్షేత్రస్థాయిలో ప్రతి సామాన్యుడి చెంతకు చేర్చారన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆధునిక పరిజ్ఞాన యంత్రాలతో కార్పొరేట్ స్థాయికి మించి సామాన్యుడికి మెరుగైన వైద్యం అందించాలని ఉద్దేశంతో ప్రభుత్వం ఆసుపత్రులను ఆధునీకరించిందన్నారు. గ్రామంలోని క్షేత్ర స్థాయిలో ప్రతి ఒక్కరికి ఇదే తరహాలో వైద్యాన్ని అందించాలని దృఢ సంకల్పంతో ప్రభుత్వం పని చేస్తుందని వివరించారు. ప్రజలు ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తప్పక తీసుకోవాలని కోరారు. వానాకాలం వచ్చిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు శుభ్రం గా ఉంచుకోవాలన్నారు. హెల్త్ సెంటర్ లో మందులు అందుబాటులో ఉంచుకోవాలని, హెల్త్ సెంటర్ పరిధిలోని గ్రామాల్లోని అరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించారు.

# పంజాబ్ గొప్ప నిర్ణయం.. ఇంటింటికీ ప్రతి నెలా 300 యూనిట్ల ఉచిత విద్యుత్!




న్యూఢిల్లీ, జులై 1: పంజాబ్‌లోని ఆమ్ ఆద్మీ ప్రభుత్వం సరికొత్త నిర్ణయం తీసుకుంది. జులై 1నుంచి ఉచిత విద్యుత్ అందిస్తామన్న ఎన్నికల హామీ నిర్ణయానికి కట్టుబడి ఇవ్వాల్టి (శుక్రవారం) నుంచి ఉచిత విద్యుత్ అందిస్తున్నట్టు ప్రకటించింది. ప్రతి ఇంటికి 300 యూనిట్ల మేరకు ఫ్రీగా విద్యుత్ సప్లయ్ చేయనున్నట్టు సీఎం భగవంత్ మాన్ ప్రకటించారు.

ప్రతి కుటుంబానికి 300 యూనిట్ల విద్యుత్‌ను ప్రతి నెల ఉచితంగా అందించడంలో పంజాబ్ ప్రభుత్వం సాధించిన గొప్ప విజయంగా ముఖ్యమంత్రి భగవంత్ మాన్ ప్రశంసించారు. శుక్రవారం సోషల్ మీడియా వేదికగా సీఎం మాట్లాడుతూ.. "పంజాబ్ చరిత్రలో మా ప్రభుత్వం ఒక కొత్త ఉదాహరణను నెలకొల్పింది. ఈ రోజు మేము పంజాబీలకు ఇచ్చిన మరో హామీని నెరవేర్చబోతున్నాము" అని తెలిపారు.

గత ప్రభుత్వాలకు హామీలు నెరవేర్చేందుకు ఐదేళ్లు పట్టేదని పంజాబ్ ముఖ్యమంత్రి అన్నారు. జులై 1 నుంచి ప్రతి ఇంటికి 300 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అందజేస్తామని ఆప్ ప్రభుత్వం గతంలో ప్రకటించింది. ప్రతి నెలా ప్రతి ఇంటికి 300 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అందించడం 2022 పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆమ్ ఆద్మీ పార్టీ చేసిన కీలక వాగ్దానాలలో ఒకటి. ఆప్ నేత, రాజ్యసభ ఎంపీ రాఘవ్ చద్దా మాట్లాడుతూ.. ప్రజలకు ఉచిత విద్యుత్ అందిస్తున్న రెండో రాష్ట్రంగా ఢిల్లీ తర్వాత పంజాబ్ నిలిచిందన్నారు."ఢిల్లీ తర్వాత గృహ అవసరాలకు ఉచిత విద్యుత్తును అందిస్తున్న రెండో రాష్ట్రంగా పంజాబ్ నిలిచిందని, ఈరోజు చారిత్రాత్మక మైన రోజుగా చద్దా తెలిపారు. పంజాబీలకు 'కేజ్రీవాల్ డి పెహ్లీ (మొదటి) హామీ' వాస్తవం అవుతుంది" అని చద్దా ట్వీట్ చేశారు. ఆర్థిక మంత్రి హర్పాల్ సింగ్ చీమా జూన్ 27న ఆప్-ప్రభుత్వ తొలి బడ్జెట్‌ను సమర్పిస్తూ 300 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించడం వల్ల రాష్ట్ర ఖజానాపై రూ.1, 800 కోట్ల అదనపు భారం పడుతుందని చెప్పారు.పంజాబ్ పౌరులందరికీ నెలకు 300 యూనిట్ల గృహ విద్యుత్ సరఫరాను ఉచితంగా అందించడం ద్వారా ంఖ ప్రభుత్వం పంజాబ్ ప్రజలకు చేసిన మొదటి హామీని నెరవేరుస్తోంది. ఇది పంజాబీలకు పెద్ద ఊరటనిస్తుంది. వృధా ఖర్చులను తగ్గించడం ద్వారా, సొంత పన్ను ఆదాయాన్ని పెంచడం ద్వారా ఈ పథకానికి ఆర్థిక సహాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే యోచిస్తోందని ఆయన చెప్పారు.

# భారతదేశంలో అతిపెద్ద తేలియాడే సోలార్ ప్లాంట్ ప్రారంభం



న్యూఢిల్లీ, జులై 1: భారతదేశం అతిపెద్ద తేలియాడే సోలార్ పవర్ ప్రాజెక్ట్ ఇప్పుడు పూర్తిగా అందుబాటులోకి వచ్చింది. తెలంగాణలోని రామగుండంలో 100 మెగావాట్ల రామగుండం ఫ్లోటింగ్ సోలార్ పివి ప్రాజెక్ట్‌లో 20 మెగావాట్ల తుది భాగం సామర్థ్యం కమర్షియల్ నిర్వహణ జూలై 01, 2022 00:00 గంటల నుండి అమలులోకి వచ్చినట్లు ఎన్టిపిసి ప్రకటించింది.

రామగుండం వద్ద 100-మెగావాట్ల సోలార్ పివి ప్రాజెక్ట్ నిర్వహణతో, దక్షిణ ప్రాంతంలో ఫ్లోటింగ్ సోలార్ కెపాసిటీ యొక్క మొత్తం వాణిజ్య కార్యకలాపాలు 217 మెగావాట్లకు పెరిగాయి. అంతకుముందు, కాయంకుళం (కేరళ) వద్ద 92 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ మరియు సింహాద్రి (ఆంధ్రప్రదేశ్) వద్ద 25 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్‌ను ఎన్టీపీసి కమర్షియల్ ఆపరేషన్‌గా ప్రకటించిందని, శ్రీ ఆనంద్ తెలిపారు.

రామగుండం వద్ద 100-మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్ట్ అధునాతన సాంకేతికతతో పాటు పర్యావరణ అనుకూల విధానాలతో నిర్మించడం జరిగింది. ప్రాజెక్ట్ 500 ఎకరాల విస్తీర్ణంలో రూ.423 కోట్లతో బిహెచ్‌ఈఎల్ చెందిన ఈపీసీ (ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్ మరియు కన్స్ట్రక్షన్) కాంట్రాక్ట్ దీనిని నిర్మించింది. ఇది మొత్తం 40 బ్లాకులుగా విభజించబడి, ఒక్కొక్క బ్లాక్ 2.5 మెగా వాట్ల ఉత్పత్తి సామర్థ్యం కలిగి ఉంది. ప్రతి బ్లాక్‌లో ఒక ఫ్లోటింగ్ ప్లాట్‌ఫారమ్ మరియు 11,200 సోలార్ మాడ్యూల్‌ల శ్రేణి ఉంటుంది. ఫ్లోటింగ్ ప్లాట్‌ఫారమ్‌లో ఒక ఇన్వర్టర్, ట్రాన్స్‌ఫార్మర్ మరియు ఒక హెచ్‌టీ బ్రేకర్ ఉంటాయి. సోలార్ మాడ్యూల్స్ ఊఆఖఇ (హై డెన్సిటీ పాలిథిలిన్) మెటీరియల్‌తో తయారు చేయబడిన ఫ్లోటర్‌లపై ఉంచబడతాయి.

మొత్తం ఫ్లోటింగ్ సిస్టమ్‌ను బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ బెడ్‌లో ఉంచిన డెడ్ వెయిట్‌లకు ప్రత్యేక హై మాడ్యులస్ పాలిథిలిన తాడుతో కలపబడి ఉంటుంది. ప్రస్తుతం ఉన్న స్విచ్ యార్డు వరకు 33కేవీ అండర్‌గ్రౌండ్ కేబుల్స్ ద్వారా విద్యుత్‌ను పంపిణీ చేస్తున్నారు. ఇన్వర్టర్, ట్రాన్స్‌ఫార్మర్, హెచ్‌టి ప్యానెల్ మరియు పర్యవేక్షక నియంత్రణ మరియు డేటా సేకరణతో సహా అన్ని ఎలక్ట్రికల్ పరికరాలు కూడా ఫ్లోటింగ్ ఫెర్రో సిమెంట్ ప్లాట్‌ఫారమ్‌లపై ఉండటంతో ఈ ప్రాజెక్ట్ ప్రత్యేకమైనది. ఈ ప్రాజెక్ట్ దిగువ యాంకరింగ్ అతి తక్కువ బరువు కలిగిన కాంక్రీట్ బ్లాకుల ద్వారా కలుపబడి ఉంటుంది.పర్యావరణ కోణంలో ఈ ప్రాజెక్ట్‌కు సంబంధిత తరలింపు ఏర్పాట్లకు కనీస భూమి అవసరం. ఇంకా, తేలియాడే సోలార్ ప్యానెల్‌ల ఉనికితో, నీటి వనరుల నుండి బాష్పీభవన రేటు తగ్గుతుంది, తద్వారా నీటి సంరక్షణలో సహాయపడుతుంది. సంవత్సరానికి సుమారు 32.5 లక్షల క్యూబిక్ మీటర్ల నీటి ఆవిరిని నివారించవచ్చు. సౌర మాడ్యూల్స్ కింద ఉన్న నీటి శరీరం వాటి పరిసర ఉష్ణోగ్రతను నిర్వహించడంలో సహాయపడుతుంది, తద్వారా వాటి సామర్థ్యాన్ని మరియు ఉత్పత్తిని మెరుగుపరుస్తుంది. అదేవిధంగా, సంవత్సరానికి 1,65,000 టన్నుల బొగ్గు వినియోగాన్ని నివారించవచ్చు; సంవత్సరానికి 2,10,000 టన్నుల కార్బన్ డై ఆక్సైడ్ ఉద్గారాలను నివారించవచ్చు.

# 'పది'లో సిద్దిపేట జిల్లా మొదటి స్థానంలో నిలవడం సంతోషంగా ఉంది : మంత్రి హరీశ్ రావు




మెదక్, జులై 1 (నేటినిజం ప్రతినిధి):ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ పదో తరగతి ఫలితాల్లో మొదటి స్థానంలో నిలిచామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు అన్నారు. పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానం సాధించిన సందర్భంగా.. సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లి తండ్రులు తమ పిల్లలు ఫస్ట్ క్లాస్‌లో పాస్ అయితే ఎంత ఆనందం పొందుతారో.. జిల్లా మొదటి స్థానంలో ఉంది అంటే నేను కూడా అంతే సంతోషపడ్డానన్నారు.

జిల్లా ఏర్పాటైన తొలినాళ్లలో 13 స్థానంలో ఉండేది. తర్వాత 9వ స్థానంలో, అదే దిశగా 3వ స్థానంలో మరింత కష్ట పడితే 2వ స్థానంలో నిలిచిందన్నారు. ఈ సారి ఎలాగైనా ఫస్ట్ నిలవాలి అని ప్రత్యేక తరగతులు నిర్వహించి ఈ సంవత్సరం ప్రథమ స్థానం సాధించడం గొప్ప విషయమని ఆనందం వ్యక్తం చేశారు. అన్ని రంగాల్లో జిల్లా ప్రథమ స్థానంలో ఉందన్నారు.

ఈ సంవత్సరం 97% తో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచాం. ఈ ఫలితాన్ని పదిలంగా కాపాడుకోవాలని, 100 శాతం ఉత్తీర్ణత దిశగా మరింత కష్ట పడుతూ ఇదే స్ఫూర్తి కొనసాగించాలన్నారు.

# నేడు, రేపు హైదరాబాద్‌లో ట్రాఫిక్ ఆంక్షలు

హైదరాబాద్, జులై 1: ప్రధాని మోదీ రాక సందర్భంగా శని, ఆదివారాల్లో ఐటీ కారిడార్‌లో వాహనాలను దారి మళ్లించనున్నట్లు సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసు అధికారులు తెలిపారు.

దారి మళ్లింపు ఇలా..!

-నీరూస్ జంక్షన్ నుంచి కొత్తగూడ, గచ్చిబౌలి జంక్షన్ వైపు వచ్చే వాహనదారులు సీఓడీ జంక్షన్ వద్ద నుంచి వయా దుర్గం చెరువు, ఇనార్బిట్ మాల్, ఐటీ సీ కోహినూర్, ఐకియా, బయోడైవర్సిటీ, గచ్చిబౌలికి చేరుకోవాలి. గచ్చిబౌలి నుంచి నీరూస్ జంక్షన్‌కు వెళ్లేవారు ఇదే మార్గాన్ని ఉపయోగించుకోవాలి.

-మియాపూర్, కొత్తగూడ, హఫీజ్‌పేట్ నుంచి హైటెక్ సిటీ, సైబర్ టవర్స్, జూబ్లీహిల్స్ వైపు వచ్చే వాహనదారులు రోలింగ్ హిల్స్, ఏఐజీ దవాఖాన, ఐకియా, ఇనార్బిట్, దుర్గం చెరువు మీదుగా ప్రయాణించాలి. హైటెక్స్, సైబర్ టవర్స్ జంక్షన్ వైపు వెళ్ళొద్దు.

-రామచంద్రపురం, చందానగర్ నుంచి మాదాపూర్, గచ్చిబౌలి వచ్చే వాహనదారులు బీహెచ్‌ఈఎల్, నల్లగండ్ల, హెచ్‌సీయూ, ట్రిపుల్ ఐటీ, గచ్చిబౌలి మార్గాన్ని వాడుకోవాలి. ఆల్విన్, కొండాపూర్ రోడ్డు వైపు వెళ్ళొద్దు.

# రష్యన్ ఫెడరేషన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో టెలిఫోన్‌లో మాట్లాడిన ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ, జులై 1: ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ, రష్యన్ ఫెడరేషన్ అధ్యక్షుడు హిజ్ ఎక్సలెన్సీ వ్లాదిమిర్ పుతిన్ తో టెలిఫోన్ లో మాట్లాడారు. ఇరువురు నాయకులు 2021 డిసెంబర్‌లో అధ్యక్షుడు పుతిన్ భారతదేశ సందర్శన సందర్భంగా తీసుకున్న నిర్ణయాల అమలు గురించి సమీక్షించారు. ప్రత్యేకించి వ్యవసాయ ఉత్పత్తులు, ఎరువులు, ఫార్మాఉత్పత్తులకు సంబంధించి ద్వైపాక్షిక వాణిజ్యంపై వారు తమ ఆలోచనలను పంచుకున్నారు. దీనిని మరింత ప్రోత్సహించాలని నిర్ణయించారు.

ఇరువురు నాయకులు అంతర్జాతీయ ఇంధనం, ఫుడ్ మార్కెట్ తో పాటు పలు అంతర్జాతీయ అంశాలను చర్చించారు.

ఉక్రెయిన్‌లో ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో ప్రధానమంత్రి, చర్చలు , దౌత్య మార్గాలలో సమస్య పరిష్కారం కావాలన్న భారతదేశపు దీర్ఘకాల విధానాన్నే ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

అంతర్జాతీయ, ద్వైపాక్షిక అంశాలపై నాయకులు ఇరువురూ ఎప్పటికప్పుడు సంప్రదించుకుంటూ ఉండేందుకు వారు అంగీకరించారు

# ఎస్ఎఫ్ఐ ధ్వంసం చేసిన తన కార్యాలయాన్ని పరిశీలించిన రాహుల్

తిరువనంతపురం, జులై 1 కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ శుక్రవారం కేరళ వెళ్లారు. ఆ రాష్ట్ర కాంగ్రెస్ నేతలు కన్నూర్ ఎయిర్‌పోర్ట్‌లో ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం తన పార్లమెంట్ నియోజకవర్గమైన వాయనాడ్‌లో రాహుల్ గాంధీ భారీ రోడ్ షో నిర్వహించారు. వాయనాడ్‌లోని తన కార్యాలయానికి ఆయన వెళ్లారు. జూన్ 24న ఎస్ఎఫ్ఐ ధ్వంసం చేసిన తన కార్యాలయాన్ని రాహుల్ గాంధీ పరిశీలించారు. ఈ ఘటన దురదృష్టకరం, బాధ్యతారహితమని విమర్శించారు. హింస ఎప్పుడూ కూడా సమస్యలను పరిష్కరించదన్నారు. 'ఇది వాయనాడ్ ప్రజల కార్యాలయం. ఇలా జరుగడం దురదృష్టకరం. హింస ఎప్పుడూ సమస్యలను పరిష్కరించదు. ఇలా చేసిన వ్యక్తులు బాధ్యతారాహిత్యంగా ప్రవర్తించారు. వారి పట్ల నాకు ఎలాంటి శత్రుత్వం లేదు' అని అన్నారు. రాహుల్ గాంధీ మూడు రోజుల పర్యటన కోసం తన నియోజకవర్గమైన వాయనాడ్‌కు వచ్చారు

కాగా, అటవీ ప్రాంతాల్లో ఒక కిలోమీటర్ వరకు బఫర్ జోన్ ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ఇటీవల ఉత్తర్వులు ఇచ్చింది. అయితే దీనిపై స్థానిక ఎంపీ అయిన రాహుల్ గాంధీ చర్యలు తీసుకోలేదంటూ ఎస్ఎఫ్ఐ ఆగ్రహించింది. జూన్ 24న ఎస్ఎఫ్ఐకు చెందిన 70 మందికిపైగా యవకులు రాహుల్ గాంధీ వాయనాడ్ కార్యాలయంలోకి బలవతంగా ప్రవేశించారు. అక్కడి సిబ్బందిపై దాడి చేయడంతోపాటు వస్తువులను ధ్వంసం చేశారు. ఈ దాడిలో కార్యాలయం కార్యదర్శి అగస్టిన్ పుల్పల్లి తీవ్రంగా గాయపడినట్లు కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. కేరళలో అధికారంలో ఉన్న సీపీఎం పనిగా ఆరోపించింది.

# జూలై 3న 34 ఎంఎంటీఎస్ రైలు సర్వీసులు రద్దు..

న్యూఢిల్లీ, జులై 1: జూలై 3న హైదరాబాద్‌లో 34 ఎంఎంటీఎస్ రైళ్లను రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే (ఎస్‌సీఆర్) ఈ రోజు (శుక్రవారం) ప్రకటించింది.

లింగంపల్లి, హైదరాబాద్ మధ్య తొమ్మిది ఓటూ రైళ్ల సర్వీసులు రద్దు చేయబడ్డాయి..

(రైలు నెం. 47129, 47132, 47133, 47135, 47136, 47137, 47139, 47138, 47140 మధ్య హైదరాబాద్‌లోని 9 సర్వీసులు). 47105, 47109, 47110, 47112, 47114, 47116, 47118, 47120), ఫలక్‌నుమా మరియు లింగంపల్లి మధ్య ఏడు సర్వీసులు (రైలు సంఖ్య (రైలు సంఖ్య. 47176, 474189, 474189, 474180, 474180). పత్రికా ప్రకటన ప్రకారం, జూలై 3న సికింద్రాబాద్-లింగంపల్లి (రైలు నెం. 47150), లింగంపల్లి-సికింద్రాబాద్ (ట్రైన్ నంబర్. 47195) సర్వీసులు కూడా పనిచేయవు.

# చట్టాలను ఉల్లంఘించే పోలీసులను దోషులుగా నిలబెడతాం : చంద్రబాబు

అమరావతి, జులై 1: తప్పుడు కేసులతో బెదిరించి ఇష్టానుసారంగా వ్యవహరించే ఏపీ పోలీసు అధికారుల ఆటలు సాగనీయబోమని టీడీపీ అధినేత చంద్రబాబు పేర్కొన్నారు. వారిపై చట్టపరంగా కేసులు పెట్టి దోషులను చేస్తామని హెచ్చరించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. సిన్సియర్‌గా పనిచేసే అధికారులను అభినందిస్తామని అన్నారు.

రాజకీయ పార్టీగా తమకు పోలీసులతో శత్రుత్వం లేదని, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభించే అధికార పార్టీపై రాజీలేని పోరాటం చేస్తామని అన్నారు. ఎవరైనా తప్పు చేస్తే చట్టపరంగా ముందుకు వెళ్లాలని సూచించారు.

చట్టాలను ఉల్లంఘించి ఏకపక్షంగా వచ్చి కావాలని తప్పుడు కేసులు పెట్టి హింసకు గురిచేస్తే సహించబోమని అన్నారు. రాష్ట్ర పోలీసులు సుప్రీం కోర్టు ఆదేశాలను పాటించడం లేదని ఆరోపించారు.

సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారని 600 మందిపై కేసులు పెట్టారని పేర్కొన్నారు. తన రాజకీయ జీవితంలో ఇలాంటి చెత్త పరిపాలన చూడలేదని చంద్రబాబు అన్నారు.

# యూనివర్సల్ సర్వీస్ ఆబ్లిగేషన్ ఫండ్ (యుఎస్ఓఎఫ్) కింద పైలట్ ప్రాజెక్టులకు నిధులు

న్యూఢిల్లీ, జులై 1: సీ-డాట్ కోర్‌తో 4జీ/5జీ ప్రోటోటైప్‌ల ఏకీకరణతో సహా.. ఈ-బ్యాండ్, ఎల్‌టీఈ స్వదేశీ టెక్నాలజీ పైలట్ ప్రాజెక్ట్‌లకు తగు నిధుల్నిసమకూర్చడానికిగాను ఇండియన్ టెలిఫోన్ ఇండస్ట్రీస్ (ఐటీఐ) లిమిటెడ్ సంస్థ, భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) తో కేంద్ర కమ్యూనికేషన్స్ మంత్రిత్వ శాఖ పరిధిలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్స్ (యుఎస్ఓఎఫ్)

ఒక ఒప్పందంపై కుదుర్చుకుంది. యూనివర్సల్ సర్వీస్ ఆబ్లిగేషన్ ఫండ్ (యుఎస్ఓఎఫ్) కింద గ్రామీణ ప్రాంతాలు, మారుమూల ప్రాంతాలలో టెలికాం రంగంలో కొత్త సాంకేతిక అభివృద్ధిని ప్రేరేపించే కార్యక్రమం కింద, ఈ టెక్నాలజీల అభివృద్ధి మరియు పటిష్టపరిచేందుకు కేంద్రం దాదాపు రూ.10 కోట్ల చొప్పున 4 పైలట్ ప్రాజెక్టులకు నిధులు సమకూర్చనుంది.

దేశీయ కంపెనీలైన ఆస్ట్రోమ్ టెక్నాలజీస్, లేఖా వైర్‌లెస్ సొల్యూషన్స్, రెసోనస్ టెక్నాలజీస్, సిగ్నల్‌ట్రాన్ సంస్థలు ఈ ప్రాజెక్టులను సీ-డాట్ మరియు డీఓటీ ప్రభుత్వ రంగ సంస్థలైన బీఎస్ఎన్ఎల్ మరియు ఐటీఐ భాగస్వామ్యంతో అమలు చేయనున్నాయి.

# జులై 4న రాష్ట్రాల స్టార్ట్-అప్ ర్యాంకింగుల ప్రకటన

న్యూఢిల్లీ, జులై 1: అంకుర సంస్థ (స్టార్ట్-అప్) ల ఏర్పాటుకు అనువైన వాతావరణాన్ని కల్పించిన రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలకు ర్యాంకింగ్ ఇచ్చేందుకు మూడవసారి నిర్వహించిన అధ్యయన నివేదిక ఫలితాలను వాణిజ్యం మరియు పరిశ్రమలు, వినియోగదారుల వ్యవహారాలు, ఆహారం మరియు ప్రజా పంపిణీ మరియు జౌళి శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ జూలై 4, 2022న న్యూఢిల్లీలో జరగనున్న ప్రత్యేక కార్యక్రమంలో విడుదల చేయనున్నారు.

సహకార స్ఫూర్తి, పోటీతత్వాన్ని ప్రోత్సహించాలన్న లక్ష్యంతో పరిశ్రమల ప్రోత్సాహం మరియు అంతర్గత వాణిజ్య విభాగం దేశంలో మూడవసారి అంకుర సంస్థల ఏర్పాటుకు అనువైన వాతావరణాన్ని కల్పించిన రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలకు ర్యాంకింగ్ ఇచ్చేందుకు అధ్యయనం నిర్వహించింది. అంకుర సంస్థల ఏర్పాటును ప్రోత్సహించేందుకు నిబంధనలను సరళీకృతం చేసి సహకారం అందించేలా రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలను ప్రోత్సహించేందుకు 2018 నుంచి ర్యాంకింగ్ ఇవ్వడం జరుగుతోంది.

ఈ ఏడాది జరిగిన పోటీలో 24 రాష్ట్రాలు ఏడు కేంద్రపాలిత ప్రాంతాలు పాల్గొన్నాయి. గత ఏడాది మొత్తం 25 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈ అధ్యయనం జరిగింది. ప్రపంచంలో అతిపెద్ద స్టార్ట్-అప్ దేశంగా భారతదేశం అభివృద్ధి చెందుతున్న సమయంలో రెండు,మూడవ తరహా నగరాలు గా గుర్తింపు పొందిన ప్రాంతాల్లో వ్యవస్థాపక వ్యవస్థను ప్రోత్సహించవలసిన అవసరం ఉంది. 2016 నాటికి దేశంలో నాలుగు రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో మాత్రమే అంకుర సంస్థల కోసం ప్రత్యేక విధానం అమలులో ఉంది. ప్రస్తుతం అంకుర సంస్థల కోసం ప్రత్యేక విధానం 30 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో అమలు జరుగుతోంది. 27 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలు ప్రత్యేక పోర్టల్ నిర్వహిస్తున్నాయి.

అంకుర సంస్థలు, సంబంధిత వర్గాలను ప్రోత్సహించేందుకు అవసరమైన నియంత్రణ, విధానం మరియు ఆర్థిక సహాయాన్ని అందించడం లాంటి 26 యాక్షన్ పాయింట్‌లతో కూడిన 7 విస్తృత సంస్కరణ అంశాల ప్రాతిపదికన ప్రస్తుత అధ్యయనం జరిగింది. సంస్కరణ రంగాలలో సంస్థాగత సహకారం, వినూత్నత, వ్యవస్థాపకతను ప్రోత్సహించడం, మార్కెట్ అవకాశాలు కల్పించడం, ఇంక్యుబేషన్ సహకారం, నిధుల సమీకరణ, అభివృద్ధికి సహకారం అందించి, సంస్థల సామర్థ్యాన్ని పెంపొందించడం లాంటి అంశాలు ఉన్నాయి.

1 అక్టోబర్ 2019 నుండి 31 జూలై 2021 వరకు రాష్ట్రాలు మరియు కేంద్రపాలిత ప్రాంతాలు అంకుర సంస్థలకు అందించిన సహకారం ఆధారంగా ప్రస్తుత అధ్యయనం జరిగింది. రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల నుంచి అందిన ఆరు నెలల నివేదికలను పరిశీలించి, 13 భాషల్లో 7200 మంది లబ్ధిదారుల నుంచి సేకరించిన అభిప్రాయాల ఆధారంగా నివేదికను రూపొందించారు. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న సంక్షోభం నేపథ్యంలో అంకుర సంస్థలకు రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలు అందించిన తోడ్పాటు ఆధారంగా రూపొందిన నివేదిక ప్రాధాన్యత సంతరించుకుంది.

2021 సంబంధించి రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలకు లభించిన రాంకులు, ప్రోత్సాహం, సలహా సూచనలు, సుస్థిర అభివృద్ధి పోర్టల్ కోసం సలహాదారులను ఆహ్వానించేందుకు ఏర్పాటైన కార్యక్రమం 4 జూలై 2022 సోమవారం ఉదయం 11:30 గంటలకు న్యూఢిల్లీ లోని అశోక్ హోటల్ లో జరుగుతుంది. అధ్యయనం జరిగిన రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన సీనియర్ అధికారులు కార్యక్రమంలో పాల్గొంటారు.

# మృతుని కుటుంబానికి అండగా పొంగులేటి

**– క్యాంపు కార్యాలయ ఇంచార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి చేతుల మీదుగా ఆర్థికసాయం అందజేత**




ఖమ్మం, జులై 1: (నేటినిజం ప్రతినిధి): ఖమ్మం: ఆపదలో నేనున్నా... మీ శీనన్నను అనే విషయాన్ని మరోమారు రుజువు చేశారు మన ఖమ్మం మాజీ పార్లమెంటు సభ్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి.... తాను అందుబాటులో లేకపోయినా బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందేలా చొరవ చూపారు. ఖమ్మం నగరంలోని 20వ డివిజన్ హుస్సేనీ మస్జిద్ సమీపంలో నివాసం ఉంటున్న అబ్బాస్ ఇటీవల అకాల మృతిచెందాడు. ఈ నేపథ్యంలో ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న బాధిత కుటుంబానికి క్యాంపు కార్యాలయ ఇంఛార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి చేతుల మీదుగా శుక్రవారం రూ.10వేలను ఆర్థికసాయంగా అందజేయించారు. భవిష్యత్తులోనూ అండగా ఉంటాననే భరోసాను కల్పించారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ జిల్లా నాయకులు షేక్ మియాభాయ్, ఇమామ్ భాయ్, కలీం, యాకుబ్, సలీం భాయ్, కోసూరి శ్రీనివాసరావు, రాయల పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు




# విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు : మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి



నిర్మల్, జులై 1: సామాన్యులు కూడా ఉన్నత విద్యావంతులు అయ్యేలా విద్యారంగంలో సీఎం కేసీఆర్ విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. శుక్రవారం సెయింట్ థామస్ హైస్కూల్ లో నిర్వహించిన అభినంధన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చదివి టెన్త్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మంత్రి శాలువాతో సత్కరించి, ప్రశంసా పత్రాలను అందజేసి వారిని అభినందించారు.

అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠ శాలలు, కళాశాలలో చదివి కార్పోరేట్‌కు దీటుగా మార్కులు సాధించడంపై ప్రశంసల కురిపించారు. ప్రభుత్వకళాశాల్లో నాణ్య మైన అందు తుందనడానికి ఇదే చక్కటి నిదర్శనమ న్నారు.

ఉమ్మడి పాలనలో ఆదిలాబాద్ జిల్లా విద్యా రంగంలో చాలా వెనుకబడి ఉండేదన్నారు. స్వరాష్ట్రంలో చదువుకు పేదరికం అడ్డురాకూడదని, హక్కుగా చదువుకోవాలనే వాతావరణం కల్పిస్తున్నా మన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు 'మన ఊరు -మన బడి' కార్యక్రమాన్ని చేపట్టామన్నారు.

పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించామంటే ఇది సమిష్టి కృషి వల్లే సాధ్యమైందన్నారు. రానున్న రోజుల్లో నిర్మల్ జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు మరింత కష్ట పడి ఈ ప్రాంతానికి మంచి పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ ముశ్రఫ్ అలీ ఫారూఖీ , డీఈవో రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# డెంగ్యూ వ్యాధి నివారణ మాసోత్సవాలు



కరీంనగర్ , జులై 1: (నేటినిజం ప్రతినిధి): డెంగ్యూ వ్యాధి నివారణకు దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా. జగన్నాథరావు తెలిపారు. జూలై 1 నుండి 31 వరకు డెంగ్యూవ్యాధి నివారణ మాసోత్సవాలు సంధర్భంగా ప్రజలలో అవగాహన కల్పించుటకు మున్సిపల్ కమిషనరు కార్యాలయం నుండి మెయిన్ రోడ్డు మీదుగా ఆరోగ్య, మునిపల్, సచివాలయ సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు.

ఈ సంధర్బంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా. జగన్నాథరావు మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి సోకిన దోమ కుట్టుట వలన డెంగ్యూ జ్వరం వస్తుందని, వ్యాధి సోకిన మొదటి వారంలో, డెంగ్యూ వైరస్ సోకిన వ్యక్తి రక్తంలో కనిపిస్తుందని, దోమ సోకిన వ్యక్తిని కుడితే, వ్యాధి దోమకు సోకుతుందని, వ్యాధి సోకిన దోమ కాటు ద్వారా ఇతర వ్యక్తులకు వైరస్ వ్యాప్తి చెందుతుందన్నారు. దోమలు నివారించుట ద్వారా ఈ వ్యాధిని అరికట్టవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరు దోమతెరలను వాడాలన్నారు. డెంగ్యూ జ్వర లక్షణాలు కనిపిస్తే వెంటనే దగ్గరలో గల ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ పి. సింహాచలం మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి రాకుండా ముందు జాగ్రత్తగా దోమలు నివారణ చేసుకోవాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. కాలువలలో చెత్త వేయకుండా, తడి,పొడి చెత్త వేరుచేసి మునిసిపల్ సిబ్బందికి అందజేయాలని తెలిపారు.

ప్రతి శుక్రవారం డ్రై డే గా పాటించాలని కోరారు. ఇంటిలో వాడని పాత్రలలో నీరు నిలువ ఉండకుండా చూడాలని, పూలకుండీలు, ఫ్రిజ్ లలో నీటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవడం ద్వారా దోమల వ్యాప్తిని సమర్ధవంతంగా ఎదుర్కోవచ్చని తెలిపారు. జిల్లా మలేరియా అధికారి పైడిరాజు మాట్లాడుతూ డెంగ్యూ వైరస్ను వ్యాపింపజేసే దోమలు పగలు, రాత్రి అనే తేడా లేకుండా కుడతాయని తెలిపారు.

ఈ రకమైన దోమలు చికున్గున్యా వైరస్లను కూడా వ్యాప్తి చేస్తాయని, ఈ వ్యాధులను నివారించడానికి ఉత్తమ మార్గం దోమల కాటు నుండి మిమ్మల్ని మీరు రక్షించుకోవడమే నని తెలిపారు. దోమలు కుట్టకుండా చర్యలు తీసుకోవాలన్నారు .మీ ఇంటి లోపల మరియు వెలుపల దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘ నాయకులు, ఆరోగ్య శాఖ సిబ్బంది, ఎ.ఎన్.ఎం ., మున్సిపల్ సిబ్బంది, మలేరియా నివారణ, సచివాలయ ఉద్యోగులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

# నిర్మల్‌ను మోడల్ పట్టణంగా తీర్చిదిద్దుతాం : మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి



నిర్మల్, జులై 1: రాష్ట్రంలోనే నిర్మల్ పట్టణాన్ని మోడల్ పట్టణంగా తీర్చిదిద్దుతామని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి గుల్జార్ మార్కెట్ మీదుగా పోస్ట్ ఆఫీస్ వరకు నూతనంగా నిర్మిస్తున్న బీటీ రోడ్ పనులను ఆయన పరిశీలించారు.

పోస్ట్ ఆఫీస్ నుంచిఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు ఆయన పాదయాత్ర చేస్తూ పనులను దగ్గరుండి పర్యవేక్షించారు. నూతనంగా ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానను సందర్శించి సిబ్బందితో మాట్లాడారు. దవాఖానలో సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు.

దేవరకోట ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులను సందర్శించారు.

భోజన శాలకు రూ.50 లక్షల నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. నిషాన్ వద్ద దర్గాకు ప్రహరీ గోడ నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట మేరకు రోడ్డు వెడల్పు పనులను పూర్తి చేసామని తెలిపారు.

రోడ్డు వెడల్పు కార్యక్రమం చేపట్టడంతో ప్రజలకు సౌకర్యవంతంగా మారిందన్నారు. రోడ్డు వెడల్పు పనులకు పట్టణ ప్రజలు సహకరించాలన్నారు. అనంతరం శివాజీ నగర్ లో నిర్మిస్తున్న మాడ్రన్ వైకుంఠ ధామం పనులను పరిశీలించారు.

కార్యక్రమంలో ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ ధర్మజి రాజేందర్, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, టీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మారుగొండ రాము, మాజీ డీసీసీబీ చైర్మన్ రాంకిషన్ రెడ్డి, దేవరకోట చైర్మన్ లింగంపల్లి లక్ష్మీ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# తిరుమల శ్రీవారి సన్నిధిలో ఎంపీ వద్దిరాజు



ఖమ్మం, జులై 1: (నేటినిజం ప్రతినిధి): రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర శుక్రవారం తిరుమల శ్రీవారి సన్నిధిలో గడిపారు. స్వామి వారి దర్శనం కోసం కుటుంబ సభ్యులతో కలిసి ఆయన గురువారం సాయంత్రమే తిరుమల చేరుకున్నారు. వేకువ జామునే ఆలయానికి చేరుకొని సుప్రభాత సేవలో పాల్గొన్నారు. అనంతరం వి.ఐ.పి ప్రొటోకాల్ మార్గంలో వెళ్లి కలియుగ దైవాన్ని దర్శించుకున్నారు.

అనంతరం రంగ నాయకుల మండపంలో వద్దిరాజు దంపతులకు వేదపండితులు ఆశీర్వచనం అందించగా, ఆలయ అధికారులు స్వామి వారి తీర్థప్రసాదాలు, పట్టువస్త్రాలను, అందజేశారు.

ముఖ్యమంత్రి కేసీఆర్ దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించేలా ఆశీర్వదించాలని, తెలంగాణ రాష్ట్ర ప్రజలంతా సుభిక్షంగా జీవించేలా చూడాలని వైకుంఠ వాసుడిని రవిచంద్ర వేడుకున్నట్లు రవిచంద్ర మీడియాకు వెల్లడించారు. ఎంపీ రవిచంద్రతో పాటు సతీమణి విజయలక్ష్మి, సోదరుడు వద్దిరాజు దేవేందర్, కుటుంబ సభ్యులు స్వామి వారిని దర్శించుకున్నారు.

# (జీడీఎస్) డాక్యుమెంట్ల వెరిఫికేషన్ కోసం చివరి తేదీని 15 జూలై వరకు పొడిగించిన తపాలా శాఖ

న్యూఢిల్లీ, జులై 1: వివిధ పోస్టుల కోసం షార్ట్‌లిస్ట్ చేయబడిన గ్రామీణ డాక్ సేవకుల (జీడీఎస్) డాక్యుమెంట్ వెరిఫికేషన్ కోసం చివరి తేదీని జూలై 15, 2022 వరకు పొడిగించాలని పోస్టల శాఖ నిర్ణయించింది.

అసొంలో నెలకొన్న వరద పరిస్థితుల కారణంగా తపాలా శాఖ ఈ నిర్ణయం తీసుకుంది.

"అసోంలో వరదల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని వివిధ పోస్టుల కోసం షార్ట్‌లిస్ట్ చేసిన గ్రామీణ డాక్ సేవక్స్ (జీడీఎస్) డాక్యుమెంట్ వెరిఫికేషన్ చివరి తేదీని జూన్ 30 నుండి జూలై 15, 2022 వరకు పొడిగించడమైంది" అని తపాలా శాఖ ఒక పత్రికా ప్రకటనలో పేర్కొంది.

# ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం.. మంత్రి పువ్వాడ

**–రఘునాధపాలెం, ఖమ్మం 16వ డివిజన్లో ప్రాధమిక ఆరోగ్య ఉప కేంద్రంలు ప్రారంభించిన మంత్రి పువ్వాడ**
**–సామాన్యుడికి ఆధునాతనమైన, మెరుగైన వైద్యం అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం**
**–రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్**





ఖమ్మం, జులై 1: (నేటినిజం ప్రతినిధి): రఘునాధపాలెం మండలం కేంద్రంలో రూ.20 లక్షలతో నిర్మించిన ప్రాధమిక అరోగ్య ఉప కేంద్రంను మంత్రి పువ్వాడ ప్రారంభించారు. ఖమ్మం కార్పోరేషన్ 16వ డివిజన్ లో రూ.16 లక్షాలతో ఎర్పాటు చేసిన ప్రాధమిక అరోగ్య ఉప కేంద్రంను ప్రారంభించారు.

రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్య రంగాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని వైద్యరంగాన్ని అత్యుత్తమంగా తీర్చిదిద్దడం, పేదలు, సామాన్యులకు చెంతనే కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఅర్ ప్రభుత్వ వైద్యాన్ని క్షేత్రస్థాయిలో ప్రతి సామాన్యుడి చెంతకు చేర్చారని అన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆధునిక పరిజ్ఞాన యంత్రాలతో కార్పొరేట్ స్థాయికి మించి సామాన్యుడికి మెరుగైన వైద్యం అందించాలని ఉద్దేశంతో ప్రభుత్వం ఆసుపత్రులను ఆదునీకరించిందన్నరు.

గ్రామంలోని క్షేత్ర స్థాయిలో ప్రతి ఒక్కరికి ఇదే తరహాలో వైద్యాన్ని అందించాలని దృడ సంకల్పంతో ప్రభుత్వం పని చేస్తుందని వివరించారు.

ప్రజలు ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తప్పక తీసుకోవాలని కోరారు. వానాకాలం వచ్చిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు శుభ్రం గా ఉంచుకోవాలన్నారు.

విష జ్వరాలు ప్రబలకుండా గ్రామ పంచాయతి ఎప్పటికపుడు బ్లీచింగ్ చెస్తు, మురుగు నిల్వ ఉండకుండ జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

హెల్త్ సెంటర్ లో మందులు అందుబాటులో ఉంచుకోవాలని, హెల్త్ సెంటర్ పరిధిలోని గ్రామాల్లోని అరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించారు.

కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, డిసిసిబి చైర్మన్ కూరాకుల నాగభూషణం, సుడా చైర్మన్ విజయ్, జిల్లా కలెక్టర్ వీపీ గౌతం, డిఎండహెచ్వో మాలతీ, డీపీవో హరిప్రసాద్, పీడీ డిఆర్డిఏ విద్యా చందన, ఈఈ పిఆర్ కె శ్రీనివాస్, ఈఈ టీఎస్ ఏంఐడీసీ ఉమా మహేశ్వర, కార్పొరేటర్లు మేడారపు వేంకటేశ్వర్లు, ఎంపీడీఓ రామక్రిష్ణ, తాసిల్దార్ నర్సింహారావు, తదితరులు ఉన్నారు.

# చిన్నారి అభినయశ్రీ వైద్యానికి మంత్రి పువ్వాడ సాయం

**–మంత్రి సిఫార్సుతో రూ. 5 లక్షల ఎల్వోసీ మంజూరు**



ఖమ్మం, జులై 1: (నేటినిజం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మరోసారి తన ఔదర్యాన్ని చాటుకున్నారు. ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గం బొడతండాకు చెందిన అభినయశ్రీ అనే చిన్నారికి కిడ్నీ సంబంధిత సంబంధిత వ్యాధితో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకొని చిన్నారికి మెరుగైన వైద్యం అందించేందుకు తక్షణమే మంత్రి అజయ్ స్పందించారు. హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తీసుకురావాలని చిన్నారి తల్లిదండ్రులకు సూచించారు. వైద్య ఖర్చులకు ప్రభుత్వం నుంచి సీఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా రూ.5 లక్షల ఎల్వోసీ మంజూరు చేయించారు. శుక్రవారం హైదరాబాద్‌లో చెక్కును చిన్నారి తండ్రి రమేష్ కు స్వయంగా మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అందజేశారు

## కథా విజేత నస్రీన్ ఖాన్‌కు బహుమతి ప్రదానం




హైదరాబాద్, జులై 1: ముల్కనూరు ప్రజాగ్రంథాలయం, నమస్తే తెలంగాణ పత్రికల సంయుక్తాధ్వర్యంలో ఏటా నిర్వహించే జాతీయ కథల పోటీల్లో 2021కి గాను వర్ధమాన రచయిత్రి నస్రీన్ ఖాన్ ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు. గత ఏడాది అక్టోబర్ మాసంలో నిర్వహించిన పోటీ ఫలితాలు ఈ ఏడాది ఫిబ్రవరి మాసంలో వెలువడ్డాయి. ఇటీవలే ముల్కనూరు గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఆమె బహుమతి అందుకున్నారు.

పోటీలో ప్రకటించిన విధంగా జ్ఞాపిక, ?25వేలు నగదు బహుమతితోపాటు ప్రశంసాపత్రం, నమస్తే తెలంగాణ వారి అక్షర నివాళి నమస్తే పీవీ, 2020 సంవత్సరపు కథా విజేతల సంకలనం వంటివి బహుమతిగా అందుకున్నారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టు, నేటి నిజం పత్రిక సంపాదకులు, సాహితీ పోషకులు బైసా దేవదాస్, సీనియర్ జర్నలిస్టు, చిన్న పత్రికల సంఘం అధ్యక్షులు సయ్యద్ యూసుఫ్ బాబు, సీనియర్ కవి విమర్శకులు, కథకులు, ఇదే పోటీల్లో గత ఏడాది ప్రథమ విజేత, నవతెలంగాణ ఫీచర్స్ ఎడిటర్, తెలంగాణ సాహితి ప్రధాన కార్యదర్శి ఆనందాచారి, వర్ధమాన రచయిత్రి, కవయిత్రి, జర్నలిస్ట్, తెలంగాణ సాహితి సహాయ కార్యదర్శి సలీమా, యువకవి, జర్నలిస్ట్, తెలంగాణ సాహితి నాయకులు మోహనకృష్ణ అనంతోజు, ప్రేరణ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు, తెలంగాణ సాహితి మేడ్చల్ బాధ్యులు శరత్ సుదర్శి తదితరులు ఆమెను అభినందించారు.

ఈ సందర్భంగా నస్రీన్ ఖాన్ మాట్లాడుతూ కథా పోటీల్లో తొలిసారి పాల్గొని బహుమతి పొందడం సంతోషంగా ఉందన్నారు. కథ రాస్తున్నప్పుడు సరైన పంథాలోనే రాసానా లేదా అనుమానం ఎప్పుడూ వెంటాడుతుంటుందని, ఈ బహుమతి కథలు రాయడం పట్ల విశ్వాసాన్ని పెంచిందని చెప్పారు. కథా పోటీల నిర్వాహకులు ఏటా ఇటువంటి పోటీలు నిర్వహించి కథకుల్లో ఉత్సాహాన్ని పెంపొందించాలని ఆకాంక్షించారు.

కార్యక్రమంలో కథా పోటీల్లోని ప్రథమ బహుమతి విజేత స్ఫూర్తి కందివనం(డిమ్మి), మరో ద్వితీయ విజేత చందు తులసి(మోదుగ పూలు)తోపాటు తృతీయ బహుమతులు, విశిష్ట బహుమతులు, ప్రోత్సాహక బహుమతులు అందుకున్నవారు తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి ఫలితాల్లో కిడ్స్ కాన్వెంట్ ప్రభంజనం

### -అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు




రాజన్న సిరిసిల్ల, జులై 1 (నేటినిజం ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన 10 వతరగతి పరీక్షల ఫలితాల్లో వేములవాడ కిడ్స్ కాన్వెంట్ స్కూల్ విజయకేతనం ఎగురవేసింది. ఈ సందర్భంగా పాఠశాలలో చదివిన తరగతి విద్యార్థులు అత్యుత్తమ మార్కులను సంపాదించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులలో జి మణిదీపక్ 10 జీపీఏ, బండ సరవు 9.8 జీపీఏ సాధించగా, వారిని కరస్పాండెంట్ నరాల దేవేందర్, ప్రిన్సిపాల్ దరక్షన్ వసఫియా, డైరక్టర్ పసీఉల్లాలు పుష్పగుచ్ఛాలతో ఆభినందించారు. అనంతరం వారి మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు ఉత్తమ ఫలితాలు పొందడానికి కారణం ఉత్తమ బోధన కృత్యాలు, నిరంతర పర్యవేక్షణ, పిల్లల పట్టుదల, ఏకాగ్రత వలనే ఈ ఫలితాలు సాధించగలిగామన్నారు. ఈ సందర్భంగా ఫలితాల ప్రభంజనం సృష్టించిన ఉపాధ్యయులకు, విద్యార్థ విద్యార్థులకు అభినందనలు తెలిపారు. కిడ్స్ కాన్వెంట్ విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణులైనట్టు వారు తెలిపారు.

## గోరక్షకుల ముసుగులో చట్టాన్ని అతిక్రమించే వారిపై చర్యలు తీసుకోండి..

### -ఖుర్బానీ ఇచ్చే జంతువుల్లో ఆవులు.. చిన్న దూడలు లేకుండా జాగ్రత్త వహించాలి

### -సీపీ సత్యనారాయణ కు ఎంఐఎం నగర అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్.. నేతల వినతి



కరీంనగర్, జులై 1: (నేటినిజం ప్రతినిధి): గోరక్షకుల ముసుగులో చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని, దాష్టీకాన్నీ ప్రదర్శించే వారిపై.. చర్యలు తీసుకోవాలని..బక్రీద్ పండుగ నిర్వహణకై సహకరించాలని, ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్.. ఆ పార్టీ నేతలు శుక్రవారం కరీంనగర్ సీపీ సత్యనారాయణ కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ బక్రీద్ లో ఖుర్బానీ ఇచ్చే జంతువుల్లో ఆవులు, చిన్న చిన్న దూడలు, జింకల వంటివి లేకుండా జాగ్రత్తలు వహించాలని.. ఆరోగ్య కరమైన జంతువులు ఉండేట్లు చూసుకోవాలని, చట్ట పరిధిలో ఉండి పండుగ జరుపుకోవాలని, చట్టాన్ని అతిక్రమించే పనులు చేయొద్దని, శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ముస్లిం సమాజానికి పిలుపునిచ్చారు. జంతువులు రవాణా చేస్తున్నప్పుడు పోలీసులు ఆపితే వారికి సహకరించాలని, గోరక్షకులు ఆపినచో తక్షణమే 100కు కాల్ చేయాలని, సమీపంలో ఉన్న పోలీసు స్టేషన్ కు సమాచారం అందించాలని కోరారు. గోరక్షకుల ముసుగులో చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే మూకలపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు కమిషనర్ కు విజ్ఞప్తి చేశారు. ముస్లింల పరంగా తాము ప్రభుత్వానికి, పోలీసులకు ఎల్లవేళలా సహకారం అందిస్తామని వినతిపత్రం లో పేర్కొన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమి, ఎంఐఎం ప్రధాన కార్యదర్శి బర్కత్ అలీ, సహాయ కార్యదర్శి మొయిజుద్దీన్ ఖాద్రి యూసుఫ్, కార్పొరేటర్ ఫిరోజ్ అఖీల్, నాయకులు అతిన, అలిబాబా, అజర్ దబీర్ తదితరులు పాల్గొన్నారు.

## జులై 4న భీమవరం మరియు గాంధీనగర్‌ను సందర్శించనున్న ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, జులై 1: ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2022వ సంవత్సరం జులై 4వ తేదీ నాడు ఆంధ్ర ప్రదేశ్ లోని భీమవరం ను మరియు గుజరాత్ లోని గాంధీనగర్ ను సందర్శించనున్నారు. ప్రముఖ స్వాతంత్ర్య యోధుడు శ్రీ అల్లూరి సీతారామరాజు 125వ జయంతి ఉత్సవాల ను ప్రధాన మంత్రి భీమవరం లో ఇంచుమించు ఉదయం 11 గంటల వేళ లో ప్రారంభించనున్నారు. ఈ ఉత్సవాలు ఏడాది పొడవునా జరుగుతాయి. దీని తరువాత సాయంత్రం సుమారు 4:30 గంటల కు ప్రధాన మంత్రి గాంధీ నగర్ లో 'డిజిటల్ ఇండియా వీక్ 2022' ను ప్రారంభిస్తారు.

భీమవరం లో ప్రధాన మంత్రి

ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' లో భాగం గా, ప్రభుత్వం స్వాతంత్ర్య యోధుల తోడ్పాటు కు తగిన గుర్తింపు ను ఇవ్వాలని, వారిని గురించి దేశం అంతటా ప్రజలు తెలుసుకొనేటట్లు చేయాలని కంకణం కట్టుకొంది. ఈ ప్రయత్నాల లో భాగం గా, ప్రముఖ స్వాతంత్ర్య యోధుడు శ్రీ అల్లూరి సీతారామరాజు యొక్క 125వ జయంతి ఉత్సవాల ను ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ భీమవరం లో ప్రారంభించబోతున్నారు. ఈ ఉత్సవాలు ఏడాది పొడవునా సాగుతాయి. శ్రీ అల్లూరి సీతారామరాజు యొక్క 30 అడుగుల ఎత్తయిన కాంస్య విగ్రహాన్ని కూడా ప్రధాన మంత్రి ఆవిష్కరిస్తారు.

శ్రీ అల్లూరి సీతారామరాజు 1897వ సంవత్సరం లో జులై 4వ తేదీ నాడు జన్మించారు. తూర్పు కనుమల ప్రాంతం లో ఆదివాసీ సముదాయాల ప్రయోజనాల ను పరిరక్షించడం కోసం బ్రిటిషు వారి కి వ్యతిరేకం గా ఆయన జరిపిన పోరాటాని కి గాను శ్రీ అల్లూరి సీతారామరాజు ను స్మరించుకోవడం జరుగుతున్నది. 1922వ సంవత్సరం లో మొదలైన రంప తిరుగుబాటు కు ఆయన నాయకత్వం వహించారు. ఆయన ను స్థానిక ప్రజానీకం 'మన్యం వీరుడు' (అడవుల యొక్క వీరుడు) అని పిలుచుకొనే వారు.

ప్రభుత్వం ఏడాది పొడవునా నిర్వహించే ఉత్సవాల లో భాగం గా అనేక కార్యక్రమాల తాలూకు ప్రణాళిక ను సిద్ధం చేసింది. విజయనగరం జిల్లా లోని పాండ్రంగి లో శ్రీ అల్లూరి సీతారామరాజు జన్మస్థలాన్ని మరియు చింతపల్లి పోలీస్ ఠాణా ను (రంప తిరుగుబాటు కు 100 సంవత్సరాలు అయినందువల్ల- ఈ పోలీసు స్టేషన్ మీద జరిగిన దాడి తోనే రంప తిరుగుబాటు మొదలైంది) పునర్ నిర్మించడం జరుగుతుంది. మోగల్లు లో అల్లూరి ధ్యాన మందిరం నిర్మాణానికి కూడా ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మందిరం లో ధ్యాన ముద్ర లో ఉండే శ్రీ అల్లూరి సీతారామరాజు యొక్క విగ్రహాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుంది. గోడల మీది చిత్రలేఖనాలు మరియు ఆర్టిఫిశల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) తో కూడినటువంటి ఇంటర్ యాక్టివ్ సిస్టమ్ మాధ్యమం ద్వారా ఆ స్వాతంత్ర్య యోధుని జీవన గాథ ను వివరించడం జరుగుతుంది.

గాంధీనగర్ లో ప్రధాన మంత్రి

ప్రధాన మంత్రి గాంధీనగర్ లో 'డిజిటల్ ఇండియా వీక్ 2022' ను ప్రారంభించనున్నారు. న్యూ ఇండియా యొక్క టెకేడ్ కు ప్రోత్సాహాన్ని ఇవ్వడం ('కేటలైజింగ్ న్యూ ఇండియా టెకేడ్') అనేది ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఇతివృత్తం గా ఉంది. సాంకేతిక విజ్ఞ?నాన్ని ప్రోత్సహించే, జీవన సౌలభ్యాని కి పూచీ పడే మరియు స్టార్ట్-అప్స్ కు ఉత్తేజాన్ని ఇచ్చే, సేవల అందజేత ను సువ్యవస్థితం చేసే ఉద్దేశ్యం తో అనేక డిజిటల్ కార్యక్రమాల ను ప్రధాన మంత్రి ఈ కార్యక్రమం లో భాగం గా ప్రారంభిస్తారు.

ప్రధాన మంత్రి 'డిజిటల్ ఇండియా భాషిణి' ని ప్రారంభిస్తారు. ఇది భారతీయ భాషల లో ఇంటర్ నెట్ మరియు డిజిటల్ సేవల ను సులభం గా అందుకోవడానికి తోడ్పడనుంది. మరి దీనిలో గళం ఆధారిత ప్రాప్తి కూడా భాగం గా ఉంటుంది. ఇది భారతీయ భాషల లో కంటెంటు తయారీ కి దోహద పడుతుంది. భారతీయ భాషల కోసం ఆర్టిఫిశల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) ఆధారిత భాషా పరమైన సాంకేతిక పరిష్కార మార్గాల ను రూపొందించడం తో ఒక కీలకమైన కార్యం అయినటువంటి బహుళ భాషల డేటాసెట్స్ ను నిర్మించడం జరుగుతుంది. 'భాషాదాన్' పేరిట ఒక క్రౌడ్ సోర్సింగ్ కార్యక్రమం అనే మాధ్యమం ద్వారా ఈ డేటా సెట్స్ ను నిర్మించడం కోసం పెద్ద ఎత్తున పాలుపంచుకొనేటట్లుగా పౌరుల కు 'డిజిటల్ ఇండియా భాషిణి' మార్గాన్ని సుగమం చేస్తుంది.ప్రధాన మంత్రి 'డిజిటల్ ఇండియా జెనెసిస్' ను ప్రారంభిస్తారు. ( ఇది జెన్-నెక్స్ట్ సపోర్ట్ ఫార్ ఇన్నొవేటివ్ స్టార్ట్-అప్స్) ను సూచిస్తుంది. అంటే నవోన్మేష స్టార్ట్ అప్స్ కోసం తదుపరి తరం సమర్థన అన్నమాట. ఇది ఒక జాతీయ డీప్-టెక్ స్టార్ట్-అప్ ప్లాట్ ఫార్మ్ అని చెప్పాలి. దీని ద్వారా భారతదేశం లో రెండో అంచె నగరాలలో, మూడో అంచె నగరాల లో ఫలప్రదమైనటువంటి స్టార్ట్ అప్స్ ను వెతకవచ్చును. వాటికి దన్ను గా నిలవడం, అవి వృద్ధి చెందేటట్లు చూడడం కోసం ఈ కార్యక్రమం సాయపడుతుంది. ఈ పథకం కోసం మొత్తం 750 కోట్ల రూపాయలు వ్యయం కావచ్చని భావిస్తున్నారు.ప్రధాన మంత్రి 'ఇండియాస్టాక్.గ్లోబల్' (ఎనిటతిజీబబిజీఞ.ఇశ్రీనీఎజీశ్రీ) ను కూడా ప్రారంభిస్తారు. ఇది.. ఆధార్, యుపిఐ, డిజిలాకర్, కోవిన్ వేక్సీన్ ప్లాట్ ఫార్మ్, గవర్నమెంట్ ఇ-మార్కెట్ ప్లేస్ (ఉవఓ ), ఆఎఖఉం ప్లాట్ ఫార్మ్ మరియు ఆయుష్మాన్ భారత్ డిజిటల్ హెల్త్ మిశన్ ల వంటి ఇండియాస్టాక్ లో భాగంగా అమలయ్యే ప్రముఖ ప్రాజెక్టు లతో కూడినటువంటి ఒక ప్రపంచ భండారం (గ్లోబల్ రిపోజిటరీ) గా ఉంటుంది. 'గ్లోబల్ పబ్లిక్ డిజిటల్ గుడ్స్' భండారం కోసం భారతదేశం అందించబోతున్న ఈ సమర్పణ, జనసంఖ్య కు పెద్ద ఎత్తున డిజిటల్ మాధ్యమ పరివర్తన పూర్వక ప్రాజెక్టుల ను రూపొందించడం లో అగ్రగామి దేశం గా భారతదేశాన్ని నిలబెట్టడం లో తోడ్పడనుంది. అంతేకాక ఈ భండారం ఈ విధమైన సాంకేతిక పరిష్కార మార్గాల కోసం అన్వేషిస్తున్నటువంటి ఇతర దేశాల కు ఎంతో సహకారి గా మారగలుగుతుంది.ప్రధాన మంత్రి 'మైస్కీమ్' (ఓమాఇఞవఎవ) ను పౌరుల కు అంకితం చేయనున్నారు. ఇది ఒక సర్వీస్ డిస్కవరీ ప్లాట్ ఫార్మ్; ఇది ప్రభుత్వ పథకాల ను సులభతరం గా అందుబాటు లోకి తీసుకు పోయేందుకు ఉద్దేశించినటువంటిది. దీనిని ఉపయోగించే వారు ఏ పథకాల కు వారు అర్హులో తెలుసుకొనేందుకు ఉపయోగపడే ఒక 'వన్-స్టాప్ సర్చ్ ఎండ్ డిస్కవరీ పోర్టల్' గా ఉండాలన్న ధ్యేయం తో రూపొందించినటువంటిదన్నమాట. మంత్రి 'మేరీ పహచాన్' ను కూడా దేశ ప్రజల కు అంకితం చేయనున్నారు. ఇది ఒక వ్యక్తి కి లాగిన్ అయ్యేందుకు ఉద్దేశించిన ఒక జాతీయ స్థాయి సింగిల్ సైన్-ఆన్ సదుపాయం. నేశనల్ సింగిల్ సైన్-ఆన్ (ఎన్ఎస్ఎస్ఒ) అనేది ఒక వినియోగదారు ప్రమాణీకరణ సేవ అని చెప్పాలి; దీనిలో వ్యక్తిగత వివరాల తాలూకు ఒక సెట్, అనేక ఆన్ లైన్ ఎప్లికేశన్స్ లేదా సేవ ల ను అందుకొనే వీలు ను కల్పిస్తుంది.ప్రధానమంత్రి 'చిప్స్ టు స్టార్ట్ అప్' (సి2ఎస్) కార్యక్రమం లో భాగం గా సమర్థన ను అందుకోవడానికి అర్హత గల 30 సంస్థల తో కూడిన ఒక సమూహాన్ని గురించి ప్రకటించనున్నారు. ఈ సి2ఎస్ ప్రోగ్రామ్ అనేది డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేశన్ మరియు పరిశోధన స్థాయిల లో సెమికండక్టర్ చిప్స్ యొక్క డిజైన్ రంగం లో వ్యక్తుల కు ప్రత్యేక శిక్షణ కు ఉద్దేశించినటువంటి కార్యక్రమం. అంతేకాక దేశం లో సెమికండక్టర్ డిజైన్ లో నిమగ్నమైన స్టార్ట్-అప్స్ యొక్క వృద్ధి కి ఒక ఉత్ప్రేరకం లాగా పని చేస్తుంది ఇది. సంస్థాగత స్థాయి లో సలహాలను మార్గదర్శకత్వాన్ని అందించడం తో పాటు గా, ఆయా సంస్థల కు డిజైన్ కోసం అత్యాధునిక సౌకర్యాల ను అందుబాటు లో ఉంచుతుంది. ఈ కార్యక్రమం సెమికండక్టర్స్ లో ఒక బలమైన డిజైన్ ఇకోసిస్టమ్ ను నిర్మించడం కోసం తలపెట్టిన ఇండియా సెమికండక్టర్ మిశన్ లో ఒక భాగం గా ఉంది.'డిజిటల్ ఇండియా వీక్ 2022' లో భాగం గా జులై 4వ తేదీ నుంచి 6వ తేదీ వరకు గాంధీనగర్ లో పలు కార్యక్రమాల ను ఏర్పాటు చేస్తున్నారు. డిజిటల్ ఇండియా యొక్క వార్షికోత్సవాన్ని కూడా జరుపుకొంటుంది. దీనిలో ఆధార్, యుపిఐ, కోవిన్, డిజిలాకర్ మొదలైన సార్వజనిక డిజిటల్ ప్లాట్ ఫార్మ్ స్ ఏ విధం గా పౌరుల కు జీవన సౌలభ్యాని కి బాటల ను పరచిందీ ఈ కార్యక్రమం కళ్లకు కడుతుంది. ఇది యావత్తు ప్రపంచం సమక్షం లో భారతదేశం యొక్క సాంకేతిక కౌశలాన్ని చాటి చెప్తుంది. స్టేక్ హోల్డర్స్ యొక్క ఒక వి స్తృత శృంఖలం తో కలసి సహకారాన్ని నెలకొల్పుకోవడం తో పాటు వ్యాపార అవకాశాల ను ఆరా తీయడం, తదుపరి తరం కోసం టెకేడ్ యొక్క అవకాశాల ను ఆవిష్కరించడం చేస్తుంది.

## 10వ తరగతి పరీక్షల్లో మైనారిటీస్ రెసిరెన్షియల్ పాఠశాల జయకేతనం



### -అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు

### -విద్యార్థులకు పలువురు అధికారుల అభినందనలు

రాజన్న సిరిసిల్ల, జులై 1 (నేటినిజం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్రం గురువారం విడుదల చేసిన పదవ తరగతి పరీక్షలో వేములవాడ పట్టణంలో మైనారిటిస్ రెసిరెన్షియల్పాఠశాల విద్యార్థ అత్యుత్తమ మార్కులు సాధించారు.

98 శాతం ఉత్తీర్ణత సాధించి సత్తా చాటి పాఠశాలకు ప్రత్యేక గుర్తింపు తెచ్చారు.

ఈ సందర్భంగా కిలోతు విష్ణు 9.5 జీపీఏ, ఎండీ నవాజ్‌ఖాన్, నిరంజన్లు 9.2 జీపీఏ సాధించారు. మొత్తం 39 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవ్వగా, 38 మంది పాసయ్యారు.

ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ సత్యప్రసాద్ ,జిల్లా మైనార్టీ అధికారి సర్వర్ మియా ప్రిన్సిపల్ కుమారస్వామి విద్యార్థులను అభినందించారు.

## షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

### -టీఆరెస్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

రాజన్న సిరిసిల్ల, జులై 1 (నేటినిజం ప్రతినిధి): వేములవాడ అర్బన్ మండలంలోని చీర్లవంచ గ్రామంలో



మంగళవారం రాత్రి ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్ తో మానువాడ రాజయ్య ఇల్లు పూర్తిగా దగ్ధమై, అందులో ఉన్న సామాగ్రి, ఇల్లు పట్టా, ఇతర వస్తువులు పూర్తిగా కాలిపోయాయి.

ఈ సందర్భంగా బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే రమేష్ బాబు ఆదేశాల మేరకు జడ్పీటీసీ మ్యాకల రవి ఆధ్వర్యంలో టీఆరెస్ పార్టీ శ్రేణులు మానువాడ రాజయ్య కుటుంబాన్ని పరామర్శించారు.

బాధిత కుటుంబాన్ని ఓదార్చి బియ్యం, నగదు, నిత్యావసర సరుకులు అందజేశారు.

అనంతరం వారు మాట్లాడుతూ రాజయ్యకు రావలసిన ఇల్లు పరిహారం 103 ఇండ్లలో నోటిఫికేషన్ అయిందన్నారు.

ఎమ్మెల్యే కోట క్రింద వచ్చే డబుల్ బెడ్ రూమ్ ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. ఇట్టి కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రంగు సత్తమ్మ రాములు, ఎంపీపీ బూర వజ్రమ్మ బాబు, టీఆరెస్ పార్టీ మండల అధ్యక్షులు ఊరడి ప్రవీణ్, సర్పంచ్ ల ఫోరమ్ మండల అధ్యక్షులు ఊరడి రాంరెడ్డి, ఎంపీటీసీ ల ఫోరమ్ అధ్యక్షులు వనపర్తి దేవరాజు, సర్పంచ్ లు రాణి చరణ్ రావు, స్వయం ప్రభ, వెంకటరమణ రావు,రాజేష్,నవీన రాజు, ఉపసర్పంచ్ చందనాల శ్రీనివాస్, గ్రామ శాఖ అధ్యక్షులు మచ్చ లక్ష్మణ్, మాజీ ఎంపీటీసీ బాబు, భాస్కర్, హరికృష్ణ, మానువాడ శ్రీనివాస్, టీఆరెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రతిమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వాటర్ ప్లాంట్ ప్రారంభం

### -పరిశుభ్రమైన నీటితో ఆరోగ్యం క్షేమం

### -ఫౌండేషన్ చైర్మన్ చెన్నమనేని వికాస్

రాజన్న సిరిసిల్ల, జులై 1 (నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని లోని రజక సంఘానికి శ్రీ మండలేశ్వర స్వామి దేవాలయం వద్ద శు



క్రవారం డాక్టర్ చెన్నమనేని వికాస్, దీపలు ఉచిత శుద్ధ జల కేంద్రంను ప్రారంభించారు.

ఈ సందర్భంగా డాక్టర్ చెన్నమనేని వికాస్ మాట్లాడుతూ అన్ని రకాల జబ్బులకు కలుషిత నీరే కారణమని అన్నారు. పరిశుభ్రమైన మంచి నీటిని తీసుకోవాలని గ్రామ వాసులకు సూచించారు. ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలని ముఖ్య ఉద్దేశంతో రజక సంఘం అధ్యక్షులు దేవయ్య, సంఘం సభ్యుల అభ్యర్థన మేరకు ప్రతిమ ఫౌండేషన్ ద్వారా శుద్ధ జల కేంద్రంను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతిమ ఫౌండేషన్ ద్వారా ప్రతి మండలానికి అత్యవసర సమయంలో అంబులెన్స్ ఉండాలనే ఉద్దేశంతో అంబులెన్స్ ప్రతి మండలానికి ఇవ్వడం జరిగిందని అన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని ప్రతిమ సంస్థ ద్వారా ఉచిత వైద్య శిబిరాలు, మహిళల ఆరోగ్యం పట్ల ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజల వద్దకే డాక్టర్లు, దవాఖానలను తీసుకవచ్చి, పలు రకాల వైద్య పరీక్షలు చేసి మందులను ఇప్పిస్తున్నామన్నారు. ప్రతిమ మీ ముంగిట్లో అను నినాదంతొ ప్రతిమ ఆరోగ్య రథంను తీసుకురావడం జరిగిందన్నారు. నేటి మహిళలు ఆర్థికంగా, మానసికంగా తన కాళ్ళ మీద తాను నిలవడానికి ముందుంటున్నారన్నారు. దీనిలో భాగంగా ప్రతిమ ఫౌండేషన్ వారికీ స్వయం ఉపాధి, ఆర్థిక చేయూతనిస్తూ వారికి అండగా ఉంటుందన్నారు. ముఖ్యంగా యువత అన్ని రంగాలలో రాణించాలని యువతకు సూచించారు. రజక సంఘం వారి కోరిక మేరకు త్వరలో ఆరోగ్య రథంతో హెల్త్ క్యాంప్ కూడ నిర్వాహిస్తామని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షులు దేవయ్య, సంఘం సభ్యులు, వార్డ్ ప్రజలు,ప్రతిమ ఫౌండేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఏనుగు మనోహర్ రెడ్డి పరామర్శ



రాజన్న సిరిసిల్ల, జులై 1 (నేటినిజం ప్రతినిధి): వేములవాడ అర్బన్ మండలం రుద్రవరం గ్రామంలో ఇటీవల మరణించిన ఊరడి సత్తి రెడ్డి కుటుంబాన్ని తెరాస సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు. ఆయన వెంట జడ్పీటీసీ మ్యాకల రవి, సర్పంచ్ ఊరడి రాంరెడ్డి, తెరాస మండల అధ్యక్షులు ఊరడి ప్రవీణ్, కట్ట ప్రవీణ్ గౌడ్, హరికృష్ణ, రాజి రెడ్డి, రవి, నర్సింహా రెడ్డి తదితరులు ఉన్నారు.

## మృతిరాలి కుటుంబానికి అసరాగా మంత్రి పువ్వాడ

### -మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆర్థిక సహాయం నగదును అందించిన పిఏ చిరుమామిళ్ల రవికిరణ్

### -లక్ష్మి కుటుంబానికి ఐదువేల రూపాయల ఆర్థిక సహాయం అందజేత



ఖమ్మం, జులై 1: (నేటినిజం ప్రతినిధి): ఖమ్మం నియోజకవర్గం రఘునాధపాలెం మండలంలోని జింకలతండా గ్రామంలో ఇటీవల మృతి చెందిన బోడ లక్ష్మి, కుటుంబాన్ని మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆదేశం మేరకు మంత్రి వ్యక్తిగత సహాయకులు చిరుమామిళ్ల రవికిరణ్, పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మృతిరాలి చిత్రపటంకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పువ్వాడ ఫౌండేషన్ ద్వారా మంత్రి ఆర్థిక సహాయం వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల తెరాస పార్టీ అధ్యక్షులు వీరునాయక్, గ్రామ సర్పంచ్ మెతీలాల్, నాయకులు భాస్కర్, చిన్నా, తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ వృత్తి అతి పవిత్రమైనది - టిడిపి నియోజకవర్గం ఇంచార్జ్ పులి రాంబాబు గౌడ్



రాజన్న సిరిసిల్ల, జులై 1 (నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణ డాక్టర్స్ డే పురస్కరించుకుని టిడిపి నియోజకవర్గం ఇన్చార్జ్ పులి రాంబాబు గౌడ్ ఆధ్వర్యంలో సీనియర్ డాక్టర్ మనోహర్ ను టిడిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పులి రాంబాబు గౌడ్ మాట్లాడుతూ వైద్యో నారాయణ హరి వైద్యులు దైవంతో సమానం అని వారి సేవలు వెలకట్టలేనివి అని కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో వారి ప్రాణాలను సైతం పణంగా పెట్టి ప్రజలకు వైద్య సేవలు అందిస్తూ సమాజంలో గౌరవప్రదమైన గుర్తింపు డాక్టర్స్ సొంతం అని ,డాక్టర్లు సేవలు అభినందనీయం అని అన్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ముంజ ఉమేందర్ గౌడ్ ,తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి రమణాయాదవ్,టిడిపి పట్టణ అధ్యక్షుడు ముప్పిడి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు

## హనుమకొండలో బీజేపీ, కాంగ్రెస్ నాయకుల మధ్య ఘర్షణ

హనుమకొండ, జులై 1 హనుమకొండలో బీజేపీ కార్యాలయం వద్ద తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అగ్నిపథ్‌ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బీజేపీ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ క్రమంలో బీజేపీ, కాంగ్రెస్ నాయకుల మధ్య తీవ్ర ఘర్షణ తలెత్తింది. ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు పరస్పరం దాడులు చేసుకున్నారు. బీజేపీ కార్యకర్తలు.. కాంగ్రెస్ నాయకుల వాహనాలను ధ్వంసం చేశారు. ఇరు వర్గాలను నిలువరించేందుకు పోలీసులు స్వల్పంగా లాఠీఛార్జి చేశారు. బీజేపీ కార్యకర్తల దాడుల్లో సుబేదారి సీఐ గన్‌మెన్ తలకు గాయాలయ్యాయి. ఇరు పార్టీల కార్యకర్తలు కర్రలతో దాడులు చేసుకోవడంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.